

కొత్త రూపు ఇలా ఉంటుంది

తిరుపతి రైల్వేస్టేషన్‌కు వరల్డ్‌క్లాస్ హంగామా

తిరుపతి రైల్వేస్టేషను రూపురేఖలు మారుతున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా, కళ్లు చెదిరేలా కొత్త స్టేషన్ పనులను పట్టాలెక్కించేందుకు అధికార వర్గాలు శ్రమిస్తున్నాయి. ప్లాట్‌ఫారాలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు కొత్త రూపుదిద్దుకుంటున్నాయి. అనునిత్యం అసంఖ్యాకంగా తిరుమలకు వచ్చే భక్తులకు అన్ని వసతులతో కూడిన స్టేషన్ నిర్మించేందుకు కేంద్రం గతేడాది జూన్ 13న రూ.300 కోట్లతో శ్రీకారం చుట్టింది. ఇప్పటికే 30 శాతం పనులు పూర్తయ్యాయి. అన్ని ఆధునిక హంగులు సమకూర్చి వచ్చే ఏడాది లోపు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

- తిరుపతి సెంట్రల్



తిరుపతి రైల్వే స్టేషన్ పాతభవన ముఖ ద్వారం

వేగంగా జరుగుతున్న పనులు

బహుళ అంతస్తుల నిర్మాణం, కార్పొరేట్ సౌకర్యాలతో మారనున్న రూపురేఖలు





ఉత్తర, దక్షిణప్లాట్‌ఫారాలను కలిపే ర్యాంపుల నిర్మాణాలు



రైల్వేస్టేషన్ దక్షిణం వైపు మూడంతస్తుల భవన నిర్మాణం

తిరుపతికి పెరగనున్న రైళ్లు

తిరుపతి పుణ్యక్షేత్రానికి పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఉత్తర భారతదేశంలో ఉన్న పలు పుణ్యక్షేత్రాలను కలుపుతూ మరికొన్ని నూతన ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపనుందని స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తెలిపారు.



దక్షిణం వైపు.. : ● ఈ భవనం అండర్ గ్రౌండ్‌లో 200 కార్లు, జీపులు, 300 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకొనే వసతులు ఉంటాయి. ● మొదటి అంతస్తులో టికెట్ బుకింగ్ కౌంటర్లు, ప్రయాణికుల రాకపోకలకు వసతులు, ట్రాఫిక్ నిర్వహణ, ఏఎస్ఎం కార్యాలయాలు, ప్రయాణికుల విశ్రాంత హాళ్లు ఉంటాయి. ● రెండో అంతస్తులో ప్రయాణికులకు అవసరమైన ఆహార పదార్థాల దుకాణాలు, విశ్రాంత గదులు ఉంటాయి. ● మూడో అంతస్తులో విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగుల కోసం రెస్ట్ రూములు, ఇతర రైల్వే అధికారుల కార్యాలయాలు ఉంటాయి. ● ఈ భవనంలో ప్రయాణికులు కింది నుంచి పైకి వెళ్లడానికి 8 లిఫ్టులు, 4 ఎస్కలేటర్లు ఉంటాయి.

ఉత్తరం వైపు.. : ● ఈ భవనాన్ని 10,800 చదరపు మీటర్లతో మూడు అంతస్తులుగా నిర్మిస్తారు. ● గ్రౌండ్ ఫ్లోర్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్లు, రాకపోకలు నిర్వహించే ప్రయాణికులకు సేవలు, రైల్వే ఆపరేటింగ్ ఉద్యోగుల కార్యాలయాలు, ఎస్ఎంఆర్, ఏఎస్ఎంల కార్యాలయాలు ఉంటాయి. ● మొదటి అంతస్తులో కామన్ వెయిటింగ్ హాల్స్, వీఐపీ లాంజ్‌లు, క్లాక్ రూమ్‌లు ఉంటాయి. ● రెండో అంతస్తులో విశ్రాంతి గదులు, ఫుడ్ కోర్టులు, పలురకాల దుకాణాలు ఉంటాయి. ● మూడో అంతస్తులో ముందస్తు టికెట్ రిజర్వేషన్ కౌంటర్లు, పలు రైల్వే విభాగాల కార్యాలయాలు, రిటైరింగ్ రూమ్‌లు ఉంటాయి. ● ఈ భవనంలో 6 లిఫ్టులు, 4 ఎస్కలేటర్లు ఉంటాయి. అండర్ గ్రౌండ్ ఉండదు.

ఈ రెండు భవనాలకు ప్లాట్‌ఫారాలతో అనుసంధానం చేస్తూ 35 మీటర్ల వెడల్పుతో రెండు వైపుల పాదచారులకు రహదారి వసతులు (ఎయిర్ కాన్ కోర్సులు) కల్పించనున్నారు.

ఇలా అయితే రద్దీ భారం తగ్గుతుంది

రైళ్ల రద్దీతో స్టేషన్ లోపలకు చేరుకోవడానికి కొంత ఆలస్యం అవుతోంది. కిలోమీటరు దూరంలో ఉన్న వెస్ట్ రైల్వే స్టేషన్‌ను ప్యాసింజర్ టెర్మినల్‌గా వినియోగించుకోవచ్చు. రేణిగుంట రైల్వే జంక్షన్ వరకు కొన్ని ఎక్స్‌ప్రెస్‌లను ఆపి మరో టెర్మినల్‌గా వినియోగించుకోవచ్చు. తిరుచానూరు రైల్వేస్టేషన్‌లోనే కొన్ని రైళ్లను నిలపవచ్చు. ఇందువల్ల నగరం కూడా విస్తరిస్తుంది.

50 ఏళ్ల విజన్‌తో నిర్మాణం

130 ఏళ్ల క్రితం మీటర్ గేజ్ రైలు మార్గంలో రెండు మూడు రైళ్లతో తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. కాలక్రమేణా ఈ మార్గం బ్రాడ్‌గేజ్‌గా మారింది. నేడు దేశం నలుమూలల నుంచి 130కి పైగా రైళ్ల తిరుపతి మీదుగా రాకపోకలు సాగిస్తూ రోజుకు 80వేల మంది వరకు ప్రయాణిస్తుంటారు. ఇందుకు అనుగుణంగా కొత్త స్టేషన్ రూపుదిద్దుకుంటోంది. స్టేషన్‌కు దక్షిణం వైపు 14,600 చదరపు మీటర్లతో అండర్ గ్రౌండ్ తోపాటు మూడంతస్తులు నిర్మిస్తున్నారు. ఉత్తరం వైపు 10,800 చదరపు మీటర్లతో మూడంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. 50 ఏళ్ల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేపడుతున్నారు.

ప్రచార సామగ్రి మాటున తాయిలాలూ తరలించేశారా?

కలెక్టర్ ఉత్తర్వుల పేరిట

వైసీపీ ప్రచార సామగ్రి తరలింపు

టీడీపీ నేతలకు, మీడియాకు నో ఎంట్రీ

వివరాలు సైతం వెల్లడించని వైనం

రేణిగుంట, మార్చి 29: జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల పేరిట రేణిగుంట గోదాముల నుంచీ వైసీపీ ప్రచార సామగ్రి మొత్తం తరలించేశారు. ఆ ప్రక్రియను పరిశీలించేందుకు వెళ్ళిన టీడీపీ నేతలను, మీడియా ప్రతినిధులను గోదాముల్లోకి అనుమతించలేదు. వీడియోలు, ఫొటోలు కూడా తీయనివ్వలేదు. కనీసం వివరాలైనా వెల్లడించమని కోరినా నోరు మెదపలేదు. రేణిగుంట శివార్లలోని ప్రైవేటు గోదాముల్లో నిల్వ వుంచిన వైసీపీ ప్రచారసామగ్రిని మరో చోటకు తరలిస్తున్నారన్న సమాచారం అందడంతో అప్రమత్తమైన శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తి నుంచీ తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అక్షింతల కృష్ణ యాదవ్ నేతృత్వంలో పలువురు నాయకులను రేణిగుంట గోదాముల వద్దకు పంపించారు. వారు వెళ్ళేటప్పటికి రేణిగుంట, ఏర్పేడు తహసిల్దార్లు, రెవిన్యూ సిబ్బంది, పోలీసు బందోబస్తు నడుమ గోదాముల నుంచీ లారీల్లో వైసీపీ ప్రచార సామగ్రిని తరలిస్తున్నారు. సీజ్ చేసిన సామగ్రిని ఎందుకు, ఎక్కడికి తరలిస్తున్నారని టీడీపీ నేతలు ప్రశ్నించగా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సామగ్రిని విడుదల చేస్తున్నామని, ఏదైనా వివరాలు కావాలంటే రిటర్నింగ్ అధికారిని అడగండంటూ రేణిగుంట తహసిల్దారు నాగేశ్వరరావు సమాధానమిచ్చారు. గోదాముల లోపలికి వెళ్ళి వీడియోలు, ఫొటోలు తీసేందుకు యత్నించగా అధికారులు వారిని లోనికి అనుమతించలేదు. ఈ విషయమై టీడీపీ నేతలు ఇచ్చిన సమాచారంతో మీడియా ప్రతినిధులు గోదాముల వద్దకు చేరుకోగా వారిని కూడా అధికారులు గోదాముల లోపలికి రానివ్వలేదు. శుక్రవారం ఉదయం నుంచీ రాత్రి వరకూ లారీల్లో వైసీపీ ప్రచార సామగ్రి గోదాముల నుంచీ బయటి ప్రాంతానికి తరలిపోతూనే వున్నాయి.ఓటర్లను ప్రభావితం చేయగలిగిన తాయిలాలను మాత్రం మూడు గోదాముల నుంచీ వేరుచేసి ఒక గోదాములో వుంచి సీజ్ చేశారు.



పోలీసు పహారా నడుమ గోదాములో ఉన్న వైసీపీ సామగ్రి తరలింపు

అధికారుల తీరుతో బలపడుతున్న అనుమానాలు

గోదాముల నుంచీ వైసీపీ ప్రచార సామగ్రిని విడుదల చేసిన క్రమంలో అధికారుల తీరు పలు అనుమానాలకు అవకాశమిస్తోంది. ఎన్నికల ప్రక్రియ వివిధ రాజకీయ పక్షాలతో కూడుకున్నది. అందుకే నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మొదలుకుని జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దాకా ఎన్నికల సమయంలో తరచూ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు పెడుతుంటారు. నాయకులకు సమగ్ర సమాచారం ఇవ్వడం, వారి అనుమానాలను నివృత్తి చేయడం, ఫిర్యాదులను పరిష్కరించడం, తాము తీసుకున్న చర్యలను వివరించడం చేస్తుంటారు. ఈ పారదర్శకత అన్నది లేకపోతే ఎన్నికల ప్రక్రియకు అర్థమే లేదు. అయితే జిల్లాలో దీనికి విరుద్ధంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. వైసీపీ ప్రచార సామగ్రికి బిల్లులు వుంటే, ఎంత పరిమాణానికి వున్నాయి? అవి సరైనవేనా లేక నకిలీవా? అన్నది ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలకు అధికారులు వివరణ ఇవ్వాల్సిన అవసరముంది. అయితే ఆ ప్రయత్నం అధికారులు చేయలేదు. మీడియా ద్వారా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యతనూ విస్మరించారు. వీటన్నింటికీ మించి గోదాముల్లో ఓటర్లకు పంపిణీ చేసే ఉద్దేశంతో నిల్వ వుంచిన తాయిలాల వాస్తవ పరిమాణం బయటికి తెలిసే అవకాశం లేకుండా పోయింది. రూ. 122 కోట్ల విలువైన తాయిలాలను గుర్తించి సీజ్ చేశామని అధికారులు చెబుతున్నప్పటికీ దాన్ని ప్రతిపక్ష పార్టీలు గానీ ప్రజలు గానీ నమ్మడం లేదు. తాయిలాలు భారీగానే వుంటాయని, అధికారులు నామమాత్రంగా నమోదు చేశారన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వైసీపీ ప్రచార సామగ్రి మాటున తాయిలాలను కూడా బయటికి తరలించేశారన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. మరోవైపున ఇందులో సహకరించిన కొందరు అధికారులకు భారీగా ముడుపులు ముట్టాయన్న ఆరోపణలూ వున్నాయి. ఈ మేరకు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు కూడా వెళుతున్నాయి. గురువారం రాష్ట్రస్థాయి ప్రతిపక్ష పార్టీల నేతలు రాష్ట్ర ఎన్నికల అధికారికి ఏకంగా జిల్లా కలెక్టర్‌పైనే ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఫిర్యాదులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు ప్రతిపక్షాలతోపాటు ప్రజల నమ్మకాన్ని కూడా కోల్పోతున్నారు. అయినా అధికారుల తీరులో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రచార సామగ్రి, తాయిలాల విషయంలో మండల స్థాయి నుంచీ జిల్లా అధికారుల వరకూ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్న అభిప్రాయం రాజకీయ, అధికార వర్గాల్లో వ్యక్తమవుతోంది. కాగా ఈ విషయమై వివరణ కోరేందుకు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారైన ఆర్డీవో రవిశంకర్‌రెడ్డికి పలుమార్లు ఫోన్ చేసినా ఆయన స్పందించలేదు.

నాయుడుపేట, శ్రీకాళహస్తిల్లో నేడు ప్రజాగళం సభలు

తిరుపతి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం పేరిట ఎన్నికల ప్రచారంలో భాగంగా నాయుడుపేట, శ్రీకాళహస్తిల్లో జరిగే బహిరంగసభల్లో పాల్గొననున్నారు.శనివారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు నుంచీ హెలికాప్టర్‌లో బయల్దేరి 2.50 గంటలకు నాయుడుపేట చేరుకుంటారు. 3 గంటల నుంచీ 4.30 గంటల వరకూ అక్కడి బస్టాండు కూడలిలో జరిగే సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సాయంత్రం 5.25 గంటలకు హెలికాప్టర్‌లో శ్రీకాళహస్తి చేరుకుంటారు.5.30 నుంచీ రాత్రి 7 గంటల వరకూ బేరివారి మండపం కూడలిలో నిర్వహించే సభలో పాల్గొంటారు.రాత్రికి శ్రీకాళహస్తిలోనే బస చేస్తారు.ఆదివారం ఉదయం కర్నూలు, ప్రకాశం, బాపట్ల జిల్లాల పర్యటనకు వెళ్ళనున్నారు. కాగా చంద్రబాబు రాకను పురస్కరించుకుని సూళ్ళూరుపేట టీడీపీ ఇంచార్జి నెలవల సుబ్రమణ్యం, అభ్యర్థి నెలవల విజయశ్రీ, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ తదితరులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే శ్రీకాళహస్తి సభను విజయవంతం చేయడానికి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పెద్ద ఎత్తున జనసమీకరణకు యత్నిస్తున్నారు. టీడీపీతో పొత్తులో వున్న బీజేపీ, జనసేన పార్టీల నేతలను, శ్రేణులను కూడా సభలో పాల్గొనాల్సిందిగా ఆయన స్వయంగా కలసి ఆహ్వానించారు. చంద్రబాబు పాల్గొనే బహిరంగసభలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని రెండు నియోజకవర్గాల్లోనూ ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.



రాజీనామా చేసి ప్రచారంలో పాల్గొనండి

● **వలంటీర్లపై ఎమ్మెల్వో ఒత్తిడి**

వరదయ్యపాళెం, మార్చి 29 : రాజీనామా చేసి వైసీపీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొనండి...పార్టీ మళ్ళీ అధికారంలోకి వచ్చాక మిమ్మల్నే విధుల్లోకి తీసుకుంటాం అంటూ వలంటీర్లపై ఒక మండల లెవల్ ఆర్గనైజర్ (ఎమ్మెల్వో) ఒత్తిడి చేస్తూ వారితో జరిపిన ఆడియో సంభాషణ వరదయ్యపాళెం మండలంలో చర్చనీయాంశంగా మారింది.వలంటీర్లకు ఎమ్మెల్వోగా వ్యవహరిస్తోన్న ఔట్‌సోర్స్ ఉద్యోగి చంద్రయ్య శుక్రవారం వలంటీర్ల వాట్సాప్ గ్రూప్‌లో మాట్లాడుతూ వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఈసీ నిబంధనలు అడ్డుగా ఉన్నాయని, రాజీనామా చేసి రెండు నెలలు జగనన్న కోసం ప్రచారంలో తిరగాలని ఆదేశించారు. మళ్ళీ జగనన్న ప్రభుత్వం వచ్చాక తీసుకుంటామని చెప్పడంతో స్పందించిన ఒక వలంటీర్ మళ్ళీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాకుంటే మా పరిస్థితి ఏమిటని ఆయనను ఫోన్‌లోనే ఎదురు ప్రశ్నలు వేశాడు. దీంతో ఖంగుతిన్న ఎమ్మెల్వో రాసిపెట్టుకో మళ్ళీ జగనన్న ప్రభుత్వమే వస్తుంది అని వలంటీర్‌కు చెప్పడం గమనార్హం. అయితే ఎమ్మెల్వో వివరణతో సంతృప్తి చెందని సదరు వలంటీర్ ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న తాము రాజీనామా ఎందుకు చేయాలని నిలదీశాడు. ఇన్నాళ్లూ పార్టీలకతీతంగా సేవ చేస్తున్నామని చెప్పుకున్న తాము, ఇప్పుడు పార్టీ జెండా పట్టుకుని ఊళ్ళలో ఎలా తిరగాలని తిరగబడ్డాడు. తాము పార్టీ కార్యకర్తలుగా విధుల్లో చేరలేదని, వలంటీర్లుగా చేరామని రాజీనామా చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పాడు. కాగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, వలంటీర్ల పర్యవేక్షణ కోసం నియమించబడ్డ ఎమ్మెల్వోలను ప్రభుత్వం నియమించిందా? లేక వైసీపీ నియమించుకుందా అన్నది తెలియరావడంలేదు.

ఆక్రమణలో కాల్వ పోరంబోకు భూమి!

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రెవెన్యూ అధికారులు పట్టించుకోరనుకున్నారో ఏమో కానీ ఆక్రమణదారులు కాల్వపోరంబోకు స్థలంలో నిర్మాణాలకు తెరలేపారు. గతంలో ఇదేభూమిలో చేపట్టిన నిర్మాణాలను అడ్డుకున్న స్థానిక రెవెన్యూ అధికారి ఇప్పుడు పట్టనట్లు వ్యవహరిస్తుండడం ఈ అనుమానాలకు బలం చేకూర్చుతోంది.తిరుపతి రూరల్ మండలం చిగురువాడ ఉత్తరపు కండ్రిగలోని శ్రీనిలయ లేఅవుట్‌లో ప్రైవేట్ భూమితో పాటు ప్రభుత్వ కాల్వపోరంబోకు భూమి కూడా కలసిపోయి వుంది. సర్వేనెంబరు 138/1, 139/2లలో వున్న కాల్వపోరంబోకు భూమిలో గతంలో చేపట్టిన నిర్మాణాలను అడ్డుకుని తొలగించిన రెవెన్యూ అధికారులు ఇప్పుడు ఇదే స్థలంలో రెండు మూడు రోజులుగా నిర్మాణాలు చేపడుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

- తిరుపతి రూరల్



వైసీపీ ప్రచారంలో వలంటీరు



పుత్తూరు అర్బన్, మార్చి 29 : పార్టీల ప్రచారాల్లో పాల్గొంటే చర్యలు తీసుకుంటామనే ఎన్నికల కమిషన్ ఆదేశాలను కొంతమంది వలంటీర్లు బేఖాతరు చేస్తున్నారు. శుక్రవారం పుత్తూరు మండల పరిధిలోని తొరూరులో వైసీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు.మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఉత్తరపుకండ్రిగ పంచాయతీకి చెందిన వలంటీర్ నవీన్ వైసీపీ కండువా కప్పుకుని మరీ పార్టీ కరపత్రాలను ఇంటింటికీ అందించాడు.నవీన్ ఉత్తరపుకండ్రి సర్పంచ్ బుజ్జిబాబు కుమారుడు కావడం విశేషం.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం) : సా. 6.27

సహరి (ఆదివారం) : ఉ. 4.50

ఈ చోద్యం కన్నారా !

● **వెల్డింగ్ షాప్‌గా మారిన మహిళా గ్రామ సమాఖ్య మందిరం**

తిరుపతి రూరల్ మండలం మంగళంలోని రణధీరపురం పంచాయతీలో ఉన్న మహిళా గ్రామ సమాఖ్య సమావేశ మందిరం ప్రైవేటు వ్యక్తుల వెల్డింగ్ షాపుగా మారిపోయింది.కొంతకాలంగా ఈ భవనంలో వెల్డింగ్‌షాపు నడుస్తోంది.భవనం లోపల, వెలుపల ఇనుప కమ్మీలు, వెల్డింగ్ సామగ్రి, పైపులు, రేకులు పడి వున్నా పంచాయతీ అధికారులు కానీ, మహిళా గ్రామ సమాఖ్య అధికారులు కానీ ప్రశ్నించిన దాఖలాల్లేవు.షాప్ నిర్వాహకుడిని ప్రశ్నిస్తే తాను డీజే సిస్టమ్స్ తయారు చేస్తున్నానని చెప్పుకొచ్చారు.పంచాయతీ కార్యదర్శిని అడగ్గా ఆ భవనం తమ ఆధీనంలోకి రాలేదని మహిళా గ్రామసమాఖ్య వారికే తెలియాలని చెప్పారు. మహిళా గ్రామసమాఖ్య అధికారిని అడిగితే ఆ భవనంపై తాము పేరు మాత్రమే రాశామని, అయితే ఆ భవనం నిర్వహణ పంచాయతీ అధికారులే చూస్తున్నారని చెప్పా రు.ఈ భవనాన్ని వాడుకుంటున్నవారు అద్దె చెల్లిస్తున్నారా, కరెంటు బిల్లు ఎవరు కడుతున్నారు అనేది తెలియాల్సి ఉంది.

- మంగళం



మహిళా గ్రామ సమాఖ్య భవనం ముందు,లోపల ఇనుక కమ్మీలు, పైపులు





భవనం ముందు వెల్డింగ్‌కోసం ఉంచిన ఇనుప పైపులు, రేకులు

చెవిరెడ్డి ట్రాప్‌లో పడి మరోసారి మోసపోకండి



ఎ.రంగంపేటలో వీల్ చైర్‌లోనే ప్రచారం చేస్తున్న పులివర్తి సుధారెడ్డి

చంద్రగిరి, మార్చి 29: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రాప్‌లో పడి మరోసారి మోసపోకండని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి అన్నారు. శుక్రవారం ఎ.రంగంపేట పంచాయతీలో మీ ఇంటికి మీ పులివర్తి నాని కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల ఆమె కాలుకు తీవ్ర గాయమైంది. దీంతో ఆమె వీల్ చైర్‌లోనే ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాయిలాలతో మళ్ళీ మోసం చేసేందుకు చెవిరెడ్డి కుట్రలు పన్నుతున్నారని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తన భర్తకు ఒక్క అవకాశం కల్పించాలని కోరారు.టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్, తెలుగు మహిళా కార్యదర్శి సింగు సుధా, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బెల్లంకొండ రమేష్‌రాయల్, నాయకులు పచ్చిపాల కిషోర్, దేవిలాల్, చెంగల్రాయాచారి, గోపాల్‌రెడ్డి, మబ్బు జ్ఞానశేఖర్, చిత్తూరు పార్థసారధియాదవ్, మునీంద్రయాదవ్, తుఖారామ్, సుధాకర్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి, సురేష్‌యాదవ్, భూలక్ష్మి, పళణి, తోకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మావతీపురం సమస్యలు పరిష్కరించండి

తిరుచానూరు, మార్చి 29: తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురంలో సమస్యలను పరిష్కరించాలని స్థానిక మహిళలు పులివర్తి సుధారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. శుక్రవారం మహిళలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానికులు పలుసమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా డంపింగ్ యార్డు ఉండటంతో దోమలు, దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నట్లు చెప్పారు.అధికార పార్టీ నేతలు ప్రభుత్వ భూములను ఇష్టానుసారం ఆక్రమించుకుంటు న్నారని తెలిపారు. సుధారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డికి దోచుకోవడంపై ఉండే శ్రద్ధ సమస్యల పరిష్కారంపై లేదని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి నానీని గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.

ఎర్రచందనం స్వాధీనం : స్మగ్లర్ అరెస్ట్



చంద్రగిరి, మార్చి 29: ఎ.రంగంపేట సమీపంలోని నాగపట్ల ఈస్ట్ బీట్ పరిధిలో అటవీ అధికారులు ఎర్రచందనం దుంగలతోపాటు ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, ఓ స్మగ్లర్‌ను అరెస్ట్ చేశారు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఎఫ్ఆర్వో దత్తాత్రేయకు అందిన సమాచారం మేరకు నాగపట్ల ఈస్ట్‌బీట్ పరిధిలో అటవీ సిబ్బంది కూంబింగ్ చేపట్టారు. కొంతమంది స్మగ్లరు ఎర్రచందనం దుంగలను రవాణా చేస్తూ అటవీ సిబ్బంది కంటపడ్డారు.వెంటనే స్మగ్లర్లు దుంగలను, వాహనాలను వదిలేసి అడవిలోకి పరారయ్యారు. వెంబడించి ఒక స్మగ్లర్‌ని అరెస్ట్ చేసి ఏడు ఎర్రచందనం దుంగలను, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన స్మగ్లర్ తమిళనాడు రాష్ట్రం తిరుణ్ణామలైకు చెందిన ఆర్ముగం రామకృష్ణన్‌గా తెలిపారు. శుక్రవారం అతడిని కోర్టుకు తరలించారు. ఎఫ్ఎస్వో ఎస్ఆర్ తాఫిక్ ఇస్తాం, ఎఫ్‌బీవో రవి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు



పాకాల రోమన్‌క్యాథలిక్ మిషన్ చర్చిలో శిలువయాగం

పాకాల, మార్చి 29: యేసుక్రీస్తు శిలువపై మరణించిన రోజును పురస్కరించుకుని స్థానిక క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చిలో శిలువయాగం నిర్వహించారు. సీఎస్ఐ సెయింట్ పాల్స్ చర్చిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఆర్సీఎం చర్చి ఫాదర్ ఆంతోనిరాజ్, సీఎస్ఐ పాస్టర్ ప్రేమ్‌కుమార్, సెక్రటరీ రాఘవేలు, ట్రెజరర్ అరుళ్ సెల్వి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో వేలం పాటల వాయిదా

పాకాల, మార్చి29: దామలచెరువు, పాకాల గ్రామ పంచాయతీలలో నిర్వహించాల్సిన వారపుసంత, దినసరి మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్, జంతు వధశాల, చింత, కొబ్బరిచెట్ల ఫలసాయం, షాపింగ్ రూముల వేలం పాటలు వాయిదా వేసినట్లు ఎంపీడీవో నాగేంద్రబాబు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 30వ తేది వేలం పాటలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున వేలంపాటలు వాయిదా వేసినట్లు తెలిపారు.

దామలచెరువులో టీడీపీ ప్రచారం



పాకాల, మార్చి 29: దామలచెరువు పంచాయతీ పరిధి గ్రామాల్లో శుక్రవారం టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సోదరి ధనలక్ష్మి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను అందజేస్తూ పులివర్తి నానీని ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు.

కొనసాగిన బస్సుల కొరత



బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 29:ఆర్టీసీ సెంట్రల్ బస్టేషన్‌లో రెండు రోజులుగా ఉన్న బస్సుల కొరత శుక్రవారమూ కొనసాగింది. బస్సుల్లేక మూడు బస్టాండులూ వెలవెలపోయాయి.గంటలతరబడి ప్లాట్‌ఫామ్స్‌వద్దే ప్రయాణికులు వేచి ఉండాల్సి వచ్చింది. ప్రధానంగా తిరుమల, కాణిపాకం, శ్రీకాళహస్తి పాయింట్ల వద్ద రద్దీ కనిపించింది.అధికారపార్టీకి చెందిన మేమంతాసిద్ధం సభలకు జనాన్ని తరలించేం దుకు దాదాపు 200 బస్సులను మళ్లించడంతో ఈపరిస్థితి ఏర్పడింది. ఎంతకీ బస్సులు రాకపోవడంతో కొందరు ప్రైవేటువాహనాలను ఆశ్రయించక తప్పలేదు.

ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



తిరుపతి (నేరవిభాగం), మార్చి 29 : నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు. తుడా మైదానం, చేపల మార్కెట్, బాలాజీ కాలనీ, ఎమ్మార్‌పల్లి సర్కిల్ ప్రాంతాల్లో వాహన చోదకులను ఆపి బ్రీత్ అనలైజర్లతో తనిఖీ చేశారు. అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపే 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ రమణకుమార్ చెప్పారు.

తిరుచ్చిపై పద్మావతిదేవి అభయం



తిరుచానూరు, మార్చి 29: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి శుక్రవారం ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయ మిచ్చారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ వేడుకగా జరిగింది. మధ్యాహ్నం ఉత్సవమూర్తికి ఫ్రైడే గార్డెన్‌లో అర్చకులు తిరుమంజనం నిర్వహించారు. అలంకార శోభితురాలైన అమ్మవారు తిరుచ్చిపై కొలువుదీరి మాడవీధుల్లో భక్తులను అనుగ్రహించారు.డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ మధు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు, అశోక్ పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో 17న శ్రీరామ నవమి ఆస్థానం

- 18న శ్రీరామ పట్టాభిషేకం

తిరుమల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 17వ తేదీన శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆస్థానం జరగనుంది. ఈ సందర్భంగా సాయంత్రం శ్రీరాములవారు హనుమంత వాహనంపై మాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. అలాగే శ్రీవారి ఆలయంలో 18న శ్రీరామ పట్టాభిషేకం నిర్వహిస్తారు. శ్రీరామనవమి సందర్భంగా 17న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయక మండపంలో సీతారామ లక్ష్మణ సమేత హనుమంతుల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.సాయంత్ర 6.30 నుంచి రాత్రి 10 గంటల వరకు బంగారువాకిలి చెంత శ్రీరామనవమి ఆస్థానాన్ని వేడుకగా నిర్వహిస్తారు. ఈ కారణంగా సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది. 18న రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య బంగారువాకిలి చెంత ఆలయ అర్చకులు శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తారు.

హోరాహోరీగా క్రీడా సాంస్కృతిక పోటీలు

సంస్కృత వర్సిటీలో సందేశాత్మకంగా నాటికలు





బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు - హాస్య చూడామణి నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తిరుపతి(రూరల్), మార్చి 29 : తిరుపతిలోని సంస్కృత వర్సిటీ వేదికగా జరిగే ఆలిండియా సంస్కృత విద్యార్థుల టాలెంట్‌ఫెస్టులో భాగంగా రెండవ రోజు శుక్రవారం క్రీడా, సాంస్కృతిక పోటీలు హోరాహోరీగా సాగాయి. ఉదయం వర్సిటీలోని యోగామందిరంలో విద్యార్థులకు యోగాసనాల పోటీలు నిర్వహించారు. సంస్కృత శాస్త్రాలకు సంబంధించి వ్యాకరణ, జ్యోతిష, న్యాయ, మీమాంస, ఆగమ విభాగాల్లో వక్తృత్వ పోటీలు జరిగాయి. మధ్యాహ్నం ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. సాయంత్రం 6గంటల నుంచి ఎస్వీ రఘునాథాచార్య ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహించిన సంస్కృత నాటక పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హాస్య చూడామణి నాటిక చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. అంతకుముందు యోగాసన పోటీలను ఆంధ్రా వర్సిటీ యోగా విభాగ అధ్యాపకులు ప్రొఫెసర్ కె.రమేష్, కేరళ వర్సిటీ యోగావిభాగ అధ్యాపకులు ప్రొఫెసర్ సుబ్రమణ్యంతో ఆతిథ్య ఎన్ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి కలసి ప్రారంభించారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎంజీ నందనరావు, అడిషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.దత్తాత్రేయ శర్మ, డాక్టర్ ఆర్.లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ గణపతి భట్, డాక్టర్ యశస్వి, ప్రొఫెసర్ నారాయణ, డాక్టర్ లీనాచంద్ర, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వి.సేతురామ్ పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి : నాని

తిరుచానూరు/తిరుపతి రూరల్, మార్చి 29: చంద్రగిరి ప్రజలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఎమ్మెల్యేగా రెండు సార్లు అవకాశం ఇస్తే నియోజవర్గ అభివృద్ధి కోసం ఏ ఒక్క పనైనా చేశారా.. అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ప్రశ్నించారు. తనకూ ఓ అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా తనపల్లిలో ఆయన పర్యటించారు. మొదటగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇంటింటా సూపర్ సిక్స్ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే అవినీతి చిట్టా తన దగ్గర ఉందన్నారు. త్వరలో సాక్ష్యాధారాలతో సహా ప్రజల ముందు ఉంచుతామన్నారు. రేణిగుంటలో పట్టుబడిన రూ.50కోట్ల ఎన్నికల తాయిలాలతో చెవిరెడ్డి బండారం బట్టబయలైందన్నారు. రానున్న ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

టీడీపీలోకి తనపల్లె వైసీపీ నేతలు

తిరుపతి రూరల్ మండలం తనపల్లె పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నేతలు శుక్రవారం నాని సమక్షంలో టీడీపీలో చేరారు. మాజీ సర్పంచ్ మురగయాదవ్ (కుమారస్వామి)తో పాటు ఆయన అనుచరులు రామకృష్ణారెడ్డి, లోకనాథరెడ్డి, రామకృష్ణశెట్టి, దుర్గాప్రసాద్, బాలకృష్ణయాదవ్, డిల్లీ ప్రసాద్‌యాదవ్, మురళిశెట్టి, నారాయణ, కన్నయ్య, విజయ్‌కుమార్, జాకీర్, వెంకటమునియాదవ్, మణి, రవిశెట్టి, మహేష్, మునియాదవ్, వెంకటేష్, తేజశెట్టి, చంద్రశేఖర శెట్టి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి నాని పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి భానుప్రకాశ్‌రెడ్డి, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు పి.మునిరత్నంరెడ్డి, ఐటీడీపీ ప్రధానకార్యదర్శి సందీప్ రెడ్డి, రూరల్ మండల బీసీసెల్ అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, తెలుగు యువత కార్యదర్శి మన్మదకుమార్‌రెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, దయాకర్, నవీన్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న పులివర్తి నాని

రేపటిలోగా లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వచ్చు

- విశ్రాంత ఉద్యోగులకు చివరి అవకాశం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 29: ఆన్‌లైన్ ద్వారా గతనెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్లు వివిధ కారణాలతో అందించలేక పోయిన విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం చివరి అవకాశం కల్పించింది. ఆదివారంలోగా ఆఫ్‌లైన్ ద్వారా లేదా సబ్ ట్రెజరీ కార్యాలయాలకు నేరుగా వచ్చి లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వచ్చు. జిల్లావ్యాప్తంగా ఉన్న 12,505 మంది పెన్షనర్లలో దాదాపు 12వేల మంది జీవన్‌ప్రమాణ్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్లు అందించారు. ఫిబ్రవరి 29వ తేదీ తర్వాత జీవన్ ప్రమాణ్ యాప్‌లో లైఫ్‌సర్టిఫికెట్ల స్వీకరణ ఆగిపోయింది. మిగిలిన వారికి చివరి అవకాశం ఇవ్వడంతో సుమారు 200 మంది సద్వినియోగం చేసుకున్నారు. మిగిలిన వారిలో.. చాలామంది ఇండ్లలో కదలలేని స్థితిలో ఉండగా, మరికొందరు విదేశాల్లో ఉన్నారు. వీరంతా ఆదివారంలోగా సర్టిఫికెట్లు ఇవ్వకపోతే పెన్షన్ కోల్పోయే ప్రమాదం ఉంది.

అదీ ఇదీ అడక్కు.. ఇచ్చింది తీసుకో...!

- ఈసారి బియ్యం ఒక్కటే
- పంచదార అరకొరే
- కందిపప్పు, గోధుమ పిండి, రాగిపిండి నోస్టాక్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 29: నిత్యావసర వస్తువుల పంపిణీ అస్తవ్యస్థంగా మారింది. ఒక్కో వస్తువును కత్తిరిస్తూ.. ఏప్రిల్ నెలకు వచ్చేసరికి బియ్యం పంపిణీకే పరిమితం చేసింది. ఇస్తున్న పంచదార పూర్తిస్థాయి స్టాకు లేకపోవడంతో కొందరికి మాత్రమే ఇవ్వనున్నారు. జిల్లావ్యాప్తంగా 5.45 లక్షల రేషన్‌కార్డులుండగా, ఏప్రిల్ నెలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఉచిత బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో కార్డుదారులకు పంపిణీ చేస్తారు. కుటుంబంలోని ఒక్కొక్కరికి ఐదు కిలోల వంతున ఇవ్వనున్నారు. ఇక, కార్డుదారులకు 250 టన్నుల చక్కెర అవసరం కాగా, ప్రభుత్వం 125 టన్నులే కేటాయించింది. దాంతో మున్సిపాలిటీల్లోని కార్డుదారులకు మాత్రమే పంపిణీ చేస్తారు. రాగి పిండిని అందరికీ ఇస్తామని మార్చి నెలలో చెప్పి, అరకొర ఇచ్చారు. 545 టన్నులకు బదులు గతనెల 250 టన్నులు, గోధుమపిండి 545 టన్నులకు బదులు 150 టన్నులు మాత్రమే పంపిణీ చేశారు. ఏప్రిల్ నెలలో స్టాకులేకపోవడంతో గోధుమపిండి పంపిణీ కూడా ఆగింది. మరోవైపు కందిపప్పు పంపిణీ గత ఆగస్టు నుంచి ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో లబ్ధిదారులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పలమనేరులో రూ.16 లక్షల పట్టివేత



ఎఫ్ఎస్ టీం,పోలీసులు పట్టుకొన్న నగదు

పలమనేరు, మార్చి 29: పలమనేరులో శుక్రవారం రాత్రి లక్ష్మి ఇంట్లో ఉన్న రూ.16 లక్షల నగదును అధికారులు పట్టుకొన్నారు. ప్రకృతి అపార్టుమెంటు ఎదురుగా ఉన్న లక్ష్మి ఇంటిలో నగదు ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ విషయాన్ని డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐ చంద్రశేఖర్ ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం అందించారు. శుక్రవారం రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో స్క్వాడ్ అధికారి రుషివర్మ, ఎస్ఐ మహాదేవి, ఐడీ పార్టీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, సిబ్బంది లక్ష్మి ఇంటికెళ్లారు. డీఎస్పీ ఇచ్చిన సెర్చ్ వారెంటుతో తనిఖీ చేశారు. ఇంట్లోని ఒక పెట్టెలో దాచి ఉంచిన రూ.500 నోట్ల కట్టలు గుర్తించారు. మొత్తం రూ.16 లక్షలను స్వాధీనం చేసుకొన్నారు. నగదు పట్టుకొన్న విషయాన్ని ఐటీ అధికారులకు తెలియజేసి కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఏసుక్రీస్తు మరణం శాంతికి సందేశం



షెకీనా చర్చిలో ప్రవచనాలు

తిరుపతి (ఆటోనగర్), మార్చి 29 : ఏసుక్రీస్తు మరణం ప్రపంచ శాంతికి సందేశమని సీనియర్ పాస్టర్ అరుల్ అరసు అన్నారు. గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని కనక భూషణ్ లేఅవుట్‌లోని షెకీనా చర్చిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తును శిక్షిస్తూ శిలువ వేసిన వారికి క్షమాగుణం ప్రసాదించాలని ప్రార్థించారు. ప్రత్యేకంగా శిలువలో పలికిన ఏడు అమూల్యమైన మాటలను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జోయల్, శామ్యూల్, చరణ్ చందు, జెర్మియా, మోనికా, సూసన్, జెస్సీ, డాక్టర్ మోషే, రఘు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

- కానిస్టేబుల్ సహా తొమ్మిది మంది అరెస్టు, మరో ఇద్దరి పరారీ
- రూ.5.26 లక్షల నగదు స్వాధీనం



జూదరులను అరెస్టు చూపిస్తున్న సీఐ సత్యబాబు

వెదురుకుప్పం, మార్చి 29: పేకాట స్థావరంపై కార్వేటినగరం పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడులు జరిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్ సహా తొమ్మిది మంది జూదరులను అరెస్టు చేశారు. ఈ వివరాలను కార్వేటినగరం సీఐ సత్యబాబు మీడియాకు తెలియజేశారు. పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారంతో కార్వేటినగరం ఎస్ఐ వెంకటకృష్ణ తమ సిబ్బందితో శుక్రవారం సాయంత్రం జూద స్థావరంపై దాడి చేశారు. కార్వేటినగరం మండలం బట్టువారిపల్లి సమీపంలో ఓ మామిడి తోటలో మంగతాయారు(లోపల-బయట) జూదమాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారయ్యారు. జూదరుల నుంచి 5,26,330 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. 11 సెల్ ఫోన్లు, ఒక బైక్‌ను సీజ్ చేశారు. జూదంలో పట్టుబడిన వారిలో తమిళనాడుకు చెందిన ఆరుగురు, ఆంధ్రాకు చెందిన ముగ్గురు ఉన్నారు. ఈ తొమ్మిది మందిలో తిరుపతి నగరం ముత్యాలరెడ్డిపల్లి పోలీసుస్టేషన్‌లో ఐడీ పార్టీ విభాగంలో కానిస్టేబుల్ పూర్ణచంద్ర కూడా ఉన్నట్లు సీఐ సత్యబాబు వెల్లడించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు. ఈ తొమ్మిది మందిపై కేసు నమోదుచేసి, పరారైన వారికోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. తమిళనాడుకు చెందిన సైమన్‌ను జూద నిర్వాహకుడిగా గుర్తించామని తెలిపారు. జూదం, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు ఎక్కడైనా జరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. వీరి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ట్రైనీ డీఎస్పీ పవన్‌కుమార్, ఎస్ఐ వెంకటకృష్ణ, ఏఎస్ఐ మునికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రుయాలో టెండరుతో పనిలేకుండా పారిశుధ్య ఏజన్సీని నియమించండి

తిరుపతి(వైద్యం), మార్చి 29 : రుయాస్పత్రిలో పారిశుధ్య ఏజన్సీ ఏ-1 సర్వీసును వెంటనే రద్దు చేసి, టెండరు లేకుండా నేరుగా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని డీఎంఈ నుంచి రుయా అధికారులకు ఆదేశాలు అందినట్లు సమాచారం. ఏ-1 సర్వీసు నిర్వాహకులపై పలు ఫిర్యాదులు రావడం, నిబంధనల మేరకు పనులు చేయకపోవడం వంటి కారణాలతో గత ఏడాది అక్టోబరులోనే వారిని తొలగించి ఆ బాధ్యతలను వేరొకరికి అప్పగించాలని రుయా అధికారులకు డీఎంఈ నుంచి ఆదేశాలు అందాయి. కానీ పలు కారణాలతో రుయా అధికారులు కాలయాపన చేస్తూ వచ్చారు. విషయం డీఎంఈ దృష్టికి వెళ్లడంతో తక్షణమే టెండర్లు పిలిచి, పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను కొత్త వారికి అప్పగించాలని ఆదేశించడంతో ఈనెల 22న రుయాస్పత్రిలో టెండరు ప్రక్రియను నిర్వహించారు. ఐదుగురు టెండరు కూడా వేశారు. కానీ కొత్త టెండర్లు ఓపెన్ చేయకుండా పాత వారినే కొనసాగిస్తుండటంతో మరోసారి ఆయన మందలించినట్లు సమాచారం. టెండరు విధానంలో లేదా టెండరు లేకుండా పారిశుధ్య నిర్వహణ కొత్త వారికి అప్పగించాలని, లేకపోతే చర్యలు తప్పవని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

కుటుంబ కలహాలతో హోటల్ యజమాని ఆత్మహత్య



బాలగంగాధర్‌తిలక్ (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, మార్చి 29: కుటుంబ కలహాలతో ఓ హోటల్ యజమాని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం పుంగనూరులో చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం మేరకు ... పుంగనూరు కొత్తపేటకు చెందిన బాలగంగాధర్‌తిలక్‌నాయుడు(56) కొత్తపేట క్రాస్‌లో హోటల్ నిర్వహిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు కుమార్తెలు పెద్దకుమార్తె లిఖిత, చిన్న కుమార్తె వినిత ఇద్దరికి వివాహం చేశారు. చిన్న కుమార్తె వినితకు ఏడాది క్రితం సమీప బంధువైన పెద్దపంజాణికి చెందిన జ్యోతిష్‌నాయుడుకు ఇచ్చి వివాహం చేశారు. అయితే జ్యోతిష్‌నాయుడు వైజాక్‌లో బిల్డర్‌గా వ్యవహరిస్తున్నట్లు అత్త, మామ, భార్యను నమ్మించి మోసం చేసినట్లు ఆరోపించారు. ఇటీవల డబ్బు అవసరమని రూ. 30లక్షలు తీసుకున్నప్పటికీ తిరిగి భార్యను ప్రతిరోజు డబ్బు కోసం వేధించడంతో పుట్టినిల్లు చేరింది. కుటుంబంలో గొడవలు జరగడంతో మనస్థాపానికి గురైన బాలగంగాధర్ రాత్రి స్థానిక మార్కెట్‌యార్డులోని ఓ చెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం కుటుంబసభ్యులు బాలగంగాధర్ ఇంటిలో లేకపోవడంతో చుట్టుపక్కల వెతకడంతో స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని కిందకు దింపారు. ఎస్ఐ సుబ్బారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతిపై ఆరా తీసి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి అంబులెన్స్ వితరణ



తడ, మార్చి 29: శ్రీసిటీలోని క్యాడ్‌బరీ డెయిరీ మిల్క్, ఓరియో, బోర్న్‌విటా వంటి దిగ్గజ బ్రాండ్‌ల తయారీ పరిశ్రమ మోండెలెజ్ ఇండియా, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా శుక్రవారం సూళ్లూరుపేట కమ్యూనిటీ ప్రభుత్వాస్పత్రికి రూ.30 లక్షల విలువైన అధునాతన వసతులు కలిగిన అంబులెన్స్‌ను వితరణగా ఇచ్చింది. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి(డీఎంఅండ్‌హెచ్‌వో) కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డా.శ్రీహరికి మెండెలెజ్ ప్లాంటు డైరెక్టర్ అమిత్‌జైన్ అధికారికంగా అంబులెన్స్ తాళాలను అందజేశారు.

భూమి ఒకరిది..పరిహారం వేరొకరికి..!

న్యాయం చేయాలంటున్న బాధితుడు



మీడియాతో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

ఏర్పేడు, మార్చి 29: అసలే భూసేకరణలో పొలం పోగొట్టుకున్నాడు.. సరేలా ఎంతో కొంత పరిహారం వస్తుందిలే అని మనసుకు సర్దిచెప్పుకున్నాడు.. తీరా అధికారుల నిర్లక్ష్యంతో ఆ నష్టపరిహారం అతడి పక్క పొలం వ్యక్తికి దక్కింది. అసలైన బాధితుడు న్యాయం కోసం ఏడాదిగా అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా కనికరించడంల లేదు. బాధితుడు నల్లపాళెం కృష్ణారెడ్డి శుక్రవారం ఏర్పేడులోని పంచాయతీ కార్యాలయం వద్ద విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఏర్పేడులోని పల్లివీధికి చెందిన నల్లపాళెం కృష్ణారెడ్డికి తన తండ్రి శంకురెడ్డి నుంచి మేర్లపాక రెవెన్యూ 7/1 సర్వే నెంబరులో 8 సెంట్లస్థలం వారసత్వంగా వచ్చింది. ఆ స్థలాన్ని కృష్ణారెడ్డి సాగు చేసుకుంటున్నాడు. ఆ మార్గంలో ఏర్పేడు నుంచి వెంకటగిరి వరకు నాలుగులేన్ల రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం భూమి సేకరించింది. రోడ్డు నిర్మాణంలో స్థలం కోల్పోయిన రైతులందరికీ ప్రభుత్వం పరిహారం అందించింది. కృష్ణారెడ్డికి మాత్రం అందించలేదు. రెవెన్యూ కార్యాలయానికి పలుమార్లు తిరిగితే పరిహారం వేరే వ్యక్తికి చెల్లించినట్లు వెల్లడైంది. దీంతో ఆయన అప్పటి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి తిరుగుతూనే ఉన్నాడు. కలెక్టర్‌కు సైతం స్పందనలో ఫిర్యాదు చేశాడు. అయినా ఫలితం లేకపోయింది. తనకు నలుగురు పిల్లలు ఉన్నారని పరిహారం ఇప్పిస్తే కుటుంబపోషణకు ఆసరగా ఉంటుందని వాపోతున్నాడు.


పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న నరసింహయాదవ్ తదితరులు

చంద్రబాబు సీఎం కావడమే లక్ష్యం

టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో పార్టీ నేతల ఉద్ఘాటన


కేక్ కట్ చేస్తున్న సుగుణమ్మ, భీమినేని చిట్టిబాబు తదితరులు

తిరుపతి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం కావడమే లక్ష్యంగా పనిచేయాలని, పొత్తులో భాగంగా సీట్లు దక్కించుకున్న ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆ పార్టీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్ కోరారు. టీడీపీ 42 ఆవిర్భావ దినోత్సవాన్ని పార్లమెంటు కార్యాలయంలో, నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ నివాసంలో ఘనంగా నిర్వహించారు. పార్లమెంటు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో నరసింహ యాదవ్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల కష్టాలను తీర్చడానికి ఎన్టీఆర్ పార్టీని స్థాపించారని తెలిపారు. పొత్తులతో ఎన్నికల బరిలో నిలబడిన కూటమి అభ్యర్థులందరినీ అత్యంత మెజారిటీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబును మళ్లీ సీఎం చేసేలాగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్ వర్మ, కృష్ణ యాదవ్, ఊకా విజయకుమార్, పులిగోరు మురళీకృష్ణారెడ్డి, కృష్ణ యాదవ్, రుద్రకోటి సదాశివం, పుష్పావతి, సింధుజ, సుబ్బు యాదవ్ (రవిశంకర్), శాంబోళ హరినాధ్, మునస్వామి యాదవ్, మనోహర్ ఆచారి, యశ్వంత్ రెడ్డి, చెంబకూరు రాజయ్య, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

● **సుగుణమ్మ నివాసంలో...**

సుగుణమ్మ నివాసంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను చంద్రబాబు కొనసాగిస్తూ పార్టీని బలోపేతం చేశారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల వారికి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. వైసీపీ తీరుపై ప్రజలు విసిగిపోయారని, చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు చిట్టిబాబు, నాయకులు బుల్లెట్ రమణ, ఊట్ల సురేంద్ర నాయుడు, శ్రీహరి నాయుడు, చినబాబు, మహేష్ యాదవ్, పుష్పావతి, బ్యాంకు శాంతమ్మ, కృష్ణ యాదవ్, ఆముదాల తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

దళితులను జగన్ వాడుకుని వదిలేశాడు

● సామాజిక న్యాయం పేరుతో రెడ్లకు తప్ప తక్కిన కులాలకు మోసం
● జనసేన, బీజేపీ ఆత్మీయ సమావేశంలో అభ్యర్థులు వరప్రసాద్, ఆరణి ధ్వజం


పార్టీల గుర్తులతో ఆరణి, వరప్రసాదరావు

తిరుపతి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : అరాచకం, అక్రమాలతో చెలరేగిపోయిన వైసీపీ నేతలను రెండు నెలల తర్వాత ప్రజలు ఇంటికే పరిమితం చేస్తారని కూటమి తరఫున పోటీ చేస్తున్న తిరుపతి ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులు అన్నారు. తిరుపతిలోని ఒక హోటల్లో శుక్రవారం జరిగినసమావేశంలో బీజేపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ రావు, జనసేన అసెంబ్లీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వరప్రసాద్‌రావు మాట్లాడుతూ జగన్ రెడ్డి దళితులను వాడుకుని వదిలేశాడని, ఎస్సీలకు ఒకసారి టికెట్ ఇస్తే మరోసారి అవకాశం ఇవ్వడంలేదని అన్నారు. పార్టీలోగానీ, ప్రభుత్వంలో గానీ పదవులన్నీ రెడ్లకే ఇచ్చాడని, తక్కిన కులాలను వాడుకుని వదిలేశాడని ఆరోపించారు. కేవలం దళితుడైనందునే తనను ఎంపీ నుంచి ఎమ్మెల్యేకి, ఎమ్మెల్యే నుంచి ఇంటికి పంపాడని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ రెడ్డికి దళితుల ఓట్లు కావాలి కానీ వారికి పదవులు మాత్రం ఇవ్వడన్నారు. కాగా తనకు ఎంపి టికెట్ రావడంలో పవన్ కల్యాణ్ పాత్ర ఉందం టూ కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కల్యాణ్ యువశక్తి, చంద్రబాబు అనుభవం, మోదీ అభివృద్ధి మంత్రం బీజేపీ, టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 72 సీట్లు ఉంటే బలిజలకు ఒక్క సీటు ఇవ్వనటువంటి వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అంటూ మండిపడ్డారు. రిజర్వుడు సీట్లు మినహా తక్కిన సీట్లు రెడ్లకు మాత్రమే కేటాయించారన్నారు. అందరి సహకారంతో తిరుపతిలో జనసేన జెండాను ఎగురవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, బీజేపీ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి రత్నప్రభ, సామంచి శ్రీనివాసులు, శాంతా రెడ్డి, పొనగంటి భాస్కర్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సెబ్‌లో సిబ్బంది కొరత

ఎన్నికల వేళ తూతూమంత్రంగా తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 29 : జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను సిబ్బంది కొరత వేధిస్తోంది. ఆధ్యాత్మిక కేంద్రం కావడం, రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంగా ఉండడంతో అక్రమ మద్యం, సారా, గంజాయి విచ్చలవిడిగా దిగుమతి అవుతోంది. పైగా ఎన్నికల వేళ ఇది మరింత ఎక్కువైంది. వాటిని అరికట్టాల్సిన సెబ్ మాత్రం తగినంత సిబ్బంది లేక చేతులెత్తేసినట్లు కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 12 సెబ్ స్టేషన్లు ఉన్నాయి. ప్రతి స్టేషన్‌కూ సీఐ స్థాయిలో దర్యాప్తు అధికారి ఉంటారు. ఇద్దరు లేక ముగ్గురు ఎస్‌ఐలు, ఇద్దరు ఏఎస్‌ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, 10 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఉండాలి. ప్రస్తుతం స్టేషన్‌కు ఒక ఎస్ఐ, నలుగురు సిబ్బంది మాత్రమే ఉన్నారు. తద్వారా తనిఖీలు, దాడులు, కేసుల నమోదు కష్టంగా తయారైంది. గడిచిన నాలుగేళ్లలో తిరుపతి జిల్లాలో సెబ్ అధికారులు నమోదు చేసిన కేసులు వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. తిరుపతి పూర్తిగా గంజాయి వనంగా మారిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కనీసం డెప్యూటేషన్‌పై సిబ్బందిని నియమించాలని సెబ్ అధికారులు కోరుతున్నారు.



చెవిరెడ్డిని, మోహిత్‌రెడ్డిని ఎన్నికలకు అనర్హులుగా ప్రకటించాలి

● **టీడీపీ, జనసేన, బీజేపీ డిమాండ్**


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 29: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డిని ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా ప్రకటించాలని చంద్రగిరి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఈసీని కోరారు. శుక్రవారం వారు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన ఇన్‌చార్జి దేవర మనోహర్ మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రూ.45 కోట్ల విలువైన సామగ్రిని గోదాముల్లో ఉంచడంపై చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టుబడిన తాయిలాల గోడౌన్‌కు నిప్పుపెట్టి ఆ నేరాన్ని తమపై వేసేందుకు చెవిరెడ్డి పన్నాగం పన్నారని ఆరోపించారు. నిప్పు పెట్టేందుకు వేకువజామున 3.30 గంటల సమయంలో ఓ వ్యక్తిని గోడౌన్ వద్దకు పంపించారని, అతడిని గుర్తించి తాము పట్టుకున్నట్టు చెప్పారు. ఆ సమయంలో చెవిరెడ్డి ఆ వ్యక్తికి ఫోన్‌చేసి మాట్లాడారని ఆరోపించారు. చెవిరెడ్డి ఒక్క తిరుపతి జిల్లాకే కాకుండా గుంటూరు, పల్నాడు, ప్రకాశం తదితర జిల్లాలకు కూడా తాయిలాలను చేరవేసే బాధ్యతలు చూస్తున్నారన్నారు. అందువల్ల వారు ఎన్నికల్లో పోటీ చేయడానికే అనర్హులుగా ప్రకటించాలని ఎన్నికల కమిషన్లకు, జిల్లా ఎన్నికల అధికారికి, ఈఆర్వోకు విజ్ఞప్తిచేశారు. అనంతరం తుమ్మలగుంటకు చెందిన దొడ్ల కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ నమ్మి ఆయనతో నడిచిన తనలాంటి వారిని ఎందరినో చెవిరెడ్డి ముంచేశాడని చెప్పారు. చెవిరెడ్డికి చట్టమంటే గౌరవం లేదని అందుకే ఎమ్మెల్యే కాకముందు ఆయనపై 29 కేసులు నమోదయ్యాయని వెల్లడించారు.అభివృద్ధి అంటే ఏంటో రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలిచిన తరువాత ప్రజలకు తెలుస్తుందన్నారు. ప్రకాశం జిల్లాలో గనుల గురించి ఇప్పటికే తెలుసుకుని ఉంటారని, వాటిని దోచుకునేందుకే చెవిరెడ్డి ఒంగోలుకు వెళ్లారన్నారు. అధికారులను బలిచేసి తుడా నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఉమ్మడి ప్రభుత్వం రాగానే చెవిరెడ్డి అవినీతిని నిగ్గుతేల్చుతామని చెప్పారు. జనసేన చంద్రగిరి మండలాధ్యక్షులు మురళిరెడ్డి, తిరుపతి అర్బన్ మండలాధ్యక్షులు కిషోర్‌రాయల్, ఉపాధ్యక్షులు సాయి, తిరుపతి రూరల్ ఉపాధ్యక్షులు హరీష్ పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు

తిరుమల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.53కోట్లు లభించింది.బుధవారం ఉదయంనుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురు వారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 65,992 మంది భక్తులు శ్రీవారిని దర్శించు కున్నారు. 25,698 మంది తలనీలాలు సమర్పించారు.

ఎస్వీయూలో అకడమిక్ సెనేట్ సమావేశం రద్దు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 29 : ఎస్వీ యూనివర్సిటీలో నిర్వహించాల్సిన అకడమిక్ సెనేట్ సమావేశం ఎన్నికల కోడ్ కారణంగా రద్దు అయ్యింది. ఏటా మార్చి నెలాఖరులోపు అకడమిక్ సెనేట్ సమావేశం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. యూనివర్సిటీ పరిధిలోని పలు కాలేజీలు, విభాగాల పరిధిలో నిర్వహించే వివిధ కోర్సులు, కొత్త కోర్సుల ఏర్పాటు, సిలబస్ మార్పు, పరీక్షల నిర్వహణ, ఇతర అకడమిక్ వ్యవహారాలపై చర్చించేవారు. ఈనెల 30వ తేదీ సమావేశం నిర్వహించనున్నట్టు అకడమిక్ సెనేట్ సభ్యులు, సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఈ సమావేశం రద్దు చేయాలని తాజాగా నిర్ణయించినట్టు తెలుస్తోంది. కోడ్ ముగిశాక నిర్వహించే అవకాశముంది.



ఎస్వీయూలో ప్రత్యేక లా కాలేజీ ఏర్పాటుకు ప్రతిపాదన

బీఏ ఎల్ఎల్‌బీ కోర్సు దశమ వార్షికోత్సవంలో తీర్మానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు),మార్చి29:ఎస్వీయూనివర్సిటీలో ప్రత్యేక లా కాలేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం కానున్నాయి. యూనివర్సిటీలో నిర్వహించిన బీఏ ఎల్ఎల్‌బీ దశమ వార్షికోత్సవంలో ప్రస్తుత, పూర్వ విద్యార్థులు కోర్సు తీరుతెన్నులు, భవిష్యత్తుపై చర్చించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) నిబంధనల మేరకు ప్రత్యేక లా కాలేజీ, భవనం, ప్రిన్సిపాల్ వంటి సదుపాయాలు అవసరమవుతాయని చర్చించారు. ప్రస్తుతం ఉన్న 55 సీట్లకు అదనంగా 200 సీట్లకు పెంచడం ద్వారా కోర్సులో ఎక్కువ మంది విద్యార్థులు చదువుకోవడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. బీఏ ఎల్ఎల్‌బీ కోర్సుకుతోడు బీకాం ఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ ఇంటిగ్రేటెడ్ కోర్సుల ఏర్పాటు విషయాన్నీ అధికారులు పరిశీలించాలని కోరారు. శుక్రవారం ముగింపు సభకు సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది మహాలక్ష్మీ పావని హాజరయ్యారు. రాత్రి ప్రత్యేక విందు (సక్సెస్ మీట్)తో వార్షికోత్సవం ముగిసింది.

రూ.5 లక్షలతో బంగారు పతకం ఏర్పాటు : బీఏ ఎల్ఎల్‌బీ కోర్సులో భాగంగా కాన్‌స్టిట్యూషన్ లా సబ్జెక్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి బంగారు పతకం అందించనున్నారు. ఇందుకు అవసరమైన రూ.5 లక్షలను సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది మహాలక్ష్మీ పావని విరాళంగా అందించనున్నట్టు తెలుస్తోంది. సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది పరమేశ్వరరావు పేరుతో ఈ పతకం ప్రదానం చేయనున్నారు.

ఆరణిని గెలిపించండి

తిరుపతి(ఆటోనగర్) మార్చి 29 : తిరుపతి శాసనసభ జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆరణి శ్రీనివాసులును గెలిపించాలని ఆరణి శివ, జనసేన పార్టీ నాయకులు శుక్రవారం ఆర్కాట్ కృష్ణప్రసాద్‌ను కలసి కోరారు. బెల్లంకొండ సురేష్, మల్లిశెట్టి లక్ష్మి, సురేష్, వినయ్, రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

భక్తులు భయపడాల్సిన అవసరం లేదు

డీఎఫ్‌వో సతీష్‌కుమార్



తిరుమల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాలినడన తిరుమలకు వచ్చే భక్తులు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ఫారెస్ట్ డీఎఫ్‌వో సతీష్‌కుమార్ అన్నారు. కట్టుదిట్టమైన భద్రత కల్పించామని తెలిపారు. శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. అలిపిరి కాలినడక మార్గంలో 200 ట్రాప్ కెమెరాల ద్వారా చిరుత, ఎలుగుబంట్ల సంచారాన్ని పరిశీలిస్తూనే ఉన్నామన్నారు. ఫిబ్రవరిలో చిరుత పులుల సంచారం కనిపించలేదన్నారు. ఈనెల 4 నుంచి శుక్రవారం రాత్రి వరకు ఐదుసార్లు చిరుత పులి, ఎలుగుబంటి సంచారాన్ని గుర్తించామన్నారు. అందుకే విధుల్లోని సిబ్బంది బృందాలుగా ఏర్పడి సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి వరకు భక్తులను గుంపులు గుంపులుగా పంపుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాయింట్ కమిటీ, వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా వారు పరిశీలించారని, వారి సూచన మేరకు మరిన్ని చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇటీవల ఏనుగుల సంచారం పెరిగిందని, వాటితోపాటు నవ్యప్రాణుల కదలికలు తెలుసుకునేలా డ్రోన్ కెమెరాను తీసుకువచ్చామని అన్నారు.

ఒకదాన్నొకటి ఢీకొన్న నాలుగు వాహనాలు

ప్రయాణికులు సురక్షితం

చిల్లకూరు, మార్చి 29: మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. నెల్లూరు నుంచి చెన్నై వెళ్లే మార్గంలో గేదె అడ్డం రావడంతో ఓ కారు అకస్మాత్తుగా ఆగడంతో వెనుక వస్తున్న మూడు కార్లు, ఆర్టీసీ బస్సు ఒకదాన్ని ఒకటి వెనుక నుంచి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు, బస్సులో ప్రయాణిస్తున్న ఎవరికీ ఏలాంటి గాయాలు కాలేదు. రెండు కార్లు, ఆర్టీసీ బస్సు దెబ్బతిన్నాయి.

వెంకన్న సేవలో ప్రముఖులు


ఆర్.కృష్ణయ్య - వినోద్ - రాజేంద్రప్రసాద్

తిరుమల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఎమ్మెల్యే వినోద్, సినీనటుడు రాజేంద్రప్రసాద్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

విశ్వం పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ అవగాహనా సదస్సుకు విశేష స్పందన

తిరుపతి(విద్య), మార్చి 29: స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ నమూనా ప్రవేశ పరీక్షకు, అవగాహనా సదస్సుకు విశేష స్పందన లభించిందని ఆ విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు హాజరై నమూనా పరీక్షలు రాశారని చెప్పారు. 2023 పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థిని చరితశ్రీ 120కి గాను 119 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించిందని వెల్లడించారు. అలాగే ఏపీఆర్జేసీ ఫలితాల్లో తనూజ, భువనేశ్వర్ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకులను సాధించారని వివరించారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27న ఉంటుందని, ఏప్రిల్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25వ తేదీన ఉంటుందని, మార్చి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8688888802, 9399976999లలో సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకోండి

రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

తిరుపతి(నేరవిభాగం), మార్చి 29 : రాష్ట్రం ఇప్పటికే ఆర్థికంగా బాగా వెనుకబడిందని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేసారు. తిరుపతిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకోవాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. దేశంలో ఇప్పటికీ 45 శాతం పేదలు ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి ఏపీ విడిపోయిన తర్వాత పేద రాష్ట్రంగా తయారైందన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

తిరుపతి (విద్య), మార్చి 29: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్-2024కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తిరుపతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 24వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని వెల్లడించారు. ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలోనే తరగతులు నిర్వహిస్తామని, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9440210803లో సంప్రదించాలని సూచించారు.



ఆదరిస్తే ఆదర్శంగా తీర్చిదిద్దుతా: లక్ష్మీసాయిప్రియ



ఆల్తూరుపాడులో ప్రజల సమస్యలు తెలుసుకొంటున్న లక్ష్మీసాయిప్రియ

డక్కిలి, మార్చి 29: తనను ఆదరించి శాసనసభకు పంపిస్తే వెంకటగిరి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆల్తూరుపాడు గ్రామంలో ఆమె రచ్చబండ నిర్వహించారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులు నిలిపివేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ వైసీపీ ప్రభుత్వం కక్షగట్టి ప్రాజెక్టు పనులు జరగనీయకుండా అడ్డుకొందని చెప్పారు. టీడీపీ అధికారంలోకి రాగానే తొలుత ప్రాజెక్టు పనులు మొదలు పెడతామని రైతులకు హామీ ఇచ్చారు. త్వరలో జరుగబోయే ఎన్నికలు యువత, ప్రజల భవిష్యత్తును నిర్ణయిస్తాయని, తనకు ఒక్క అవకాశం ఇస్తే వెంకటగిరి రూపురేఖలు మార్చి చూపుతామన్నారు. అనంతరం ఆమె ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పోలంరెడ్డి వెంకటరెడ్డి, చెలికం భాస్కరరెడ్డి, కుమార్ యాదవ్, కాపా శ్రీనివాసులు నాయుడు, డక్కిలి చంద్రారెడ్డి, అయ్యపరెడ్డి, మునిస్వామి రెడ్డి, శివప్రసాద్, పెంచలరెడ్డి. పిల్లి శ్రీనివాసులు రెడ్డి, మునికృష్ణయ్య, మోపూరు జనార్దనరెడ్డి, రాజయ్యనాయుడు, హరినాద్, పోకూరు రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మీ ఇంటి బిడ్డగా ఆదరించండి

వెంకటగిరి, మార్చి 29: పట్టణంలోని 9వ వార్డులో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో వెంకటగిరి నియోజకవర్గం బాగా వెనకబడి పోయిందన్నారు. ఎక్కడ చూసినా రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నారని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక యువతకు ఉద్యోగ అవకాశాలు, చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యాన్ని మెరుగుపరుస్తామని చెప్పారు. కాగా, ప్రచారంలో భాగంగా శివాలయం ప్రాంతలో పర్యటించిన లక్ష్మీసాయిప్రియ ఓ టిఫిన్ సెంటర్‌లో దోశలు వేశారు. కార్యక్రమంలో నాయకలు పులికోల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, బీరం రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాథనాయుడు, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులు నాయుడు, మల్లారపు బాబు, చెంగారావు తదితరులు పాల్గొన్నారు.

కోటలో జయహో బీసీ

కోట, మార్చి 29: కోట క్రాస్‌రోడ్డులో టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జయహో బీసీ కార్యక్రమం జరిగింది. బీసీ నాయకులు జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌తో పాటు మాజీ సీఎం చంద్రబాబునాయుడు బీసీల పక్షపాతిగా వ్యవహరించారన్నారు. బీసీల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. బీసీల కోసం ప్రత్యేక కార్పొరేషన్లు, రాజకీయ రిజర్వేషన్లు కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. అందరూ కలసికట్టుగా పనిచేసి చంద్రబాబును సీఎంగా, పాశం సునీల్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుందామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలకృష్ణయాదవ్, తిరుపతి పార్లమెంటు కార్యదర్శి తీగల సురేష్ బాబు, వరిదిగొల్ల కోటేశ్వరప్రసాద్, జలీల్ అహ్మద్, మధుయాదవ్, తల్లం శ్రీనివాసులు, వంశీ, మోహన్, షంషద్దీన్, నాయబ్, కుమారి తదితరులు పాల్గొన్నారు

భక్తులు కట్టుదిట్టమైన భద్రత

డీఎఫ్‌వో సతీష్‌కుమార్

తిరుమల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాలినడన తిరుమలకు వచ్చే భక్తులు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, కట్టుదిట్టమైన భద్రత కల్పించామని ప్రభుత్వ ఫారెస్ట్ డీఎఫ్‌వో సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. అలిపిరి కాలినడక మార్గంలో 200 ట్రాప్ కెమెరాల ద్వారా చిరుత, ఎలుగుబంట్ల సంచారాన్ని పరిశీలిస్తూనే ఉన్నామన్నారు. ఫిబ్రవరిలో చిరుత పులుల సంచారం కనిపించలేదన్నారు. ఈనెల 4 నుంచి శుక్రవారం రాత్రి వరకు ఐదుసార్లు చిరుత పులి, ఎలుగబంటి సంచారాన్ని గుర్తించామన్నారు. అందుకే విధుల్లోని సిబ్బంది బృందాలుగా ఏర్పడి సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి వరకు భక్తులను గుంపులు గుంపులుగా పంపుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాయింట్ కమిటీ, వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా వారు పరిశీలించారని, వారి సూచన మేరకు మరిన్ని చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇటీవల ఏనుగుల సంచారం పెరిగిందని, వాటితోపాటు వన్యప్రాణుల కదలికలు తెలుసుకునేలా డ్రోన్ కెమెరాను తీసుకువచ్చామని అన్నారు.

4 నుంచి 'సదరం' స్లాట్‌ల బుకింగ్

పుత్తూరు అర్బన్, మార్చి 29: వివిధ కేటగిరీలకు చెందిన దివ్యాంగులు పొందే ప్రయోజనాల కోసం అవసరమైన 'సదరం' సర్టిఫికెట్ల జారీ కోసం స్క్రీనింగ్ పరీక్షలు చేయడానికి స్లాట్ బుకింగ్‌లు ఏప్రిల్ 4వ తేదీ నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఎంపిక చేసిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన స్లాట్ బుకింగ్‌లు వాటితో పాటు శారీరక పరీక్షలు ఈనెలాఖరుతో పూర్తి కానున్నాయి. ఇక ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన కొత్త స్లాట్‌లు అందుబాటులోకి రానున్నాయి. స్లాట్ బుకింగ్‌లు 4వ తేదీ అందుబాటులోకి వస్తున్నా ఏప్రిల్ నెల 8వ తేదీ నుంచి ఎంపిక చేసుకున్న స్లాట్ తేదీలను బట్టి ఆసుపత్రుల్లో స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నారు. ఆర్థోపెడిక్, మానసిక, కంటి, ఈఎన్‌టీ వైకల్యం ఉన్న వారు నిర్ధారణ సర్టిఫికెట్ల కోసం స్క్రీనింగ్ చేసి అంగవైకల్య శాతాన్ని నిపుణులు నిర్ధారించి ధృవపత్రాలు అర్హులైన వారికి జారీ చేస్తారు. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, బస్సులు, రైళ్లలో ప్రయాణాలు, సామాజిక పింఛన్లు తదితర సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేందుకు సదరం కేంద్రాలు జారీ చేసే ధృవపత్రాలు మాత్రమే ప్రామాణికమవుతాయి. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని ప్రభుత్వ జనరల్, ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో సదరం పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆసుపత్రుల్లో సోమవారం, గురువారం మాత్రమే పరీక్షలు నిర్వహించనున్నారు. కాబట్టి దివ్యాంగులు తమకు అనువైన రోజులను, ఆసుపత్రులను స్లాట్ బుకింగ్ ద్వారా ఎంపిక చేసుకోవచ్చు. తమ సమీపంలోని సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో 4వ తేదీ నుంచి ఈ స్లాట్ బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి.

విద్యార్థిపై దాడి

గూడూరు, మార్చి 29: మండలంలోని చెన్నూరు గ్రామంలో గురువారం రాత్రి ఓ విద్యార్థిపై దాడి జరిగిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసుల కథనం మేరకు... మండలంలోని చెన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి విద్యార్థులు ఫేర్‌వెల్ పార్టీ జరుపుకున్నారు. అదే పాఠశాలలో పదో తరగతి చదివిన లింగసముద్రం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి, ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న తన సోదరుడితో కలిసి ఫేర్‌వెల్ పార్టీకి హాజరయ్యారు. వారిద్దరూ తిరిగి గ్రామానికి వెళుతుండగా చెన్నూరు గ్రామానికి చెందిన విష్ణుతో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో విష్ణు కత్తితో ఇంటర్ విద్యార్థిపై దాడి చేసి గాయపరిచాడు. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అరాచక పాలన అంతానికే ప్రజాగళం: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, మార్చి 29: అవినీతి, అరాచకాలతో వ్యవస్థలను నాశనం చేసిన జగన్ ప్రభుత్వాన్ని గద్దెదించి తరిమి కొట్టేందుకు ప్రజలను అప్రమత్తం చేస్తూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజాగళం పేరుతో గళమెత్తారని సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శనివారం నాయుడుపేటలో చంద్రబాబు పాల్గొననున్న ప్రజాగళం కార్యక్రమ ఏర్పాట్లను ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, గూడూరు టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌తో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ సీఎం జగన్ అభివృద్ధి నిరోధకుడని ధ్వజమెత్తారు. కనీసం రాష్ట్రానికి రాజధాని కూడా లేకుండా చేసిన జగన్ ప్రభుత్వాని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. నాయుడుపేట పట్టణంలో పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం సర్కిల్ వద్ద శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రజాగళం సభలో చంద్రబాబునాయుడు పాల్గొన్ని వైసీపీ అరాచకాలను ఎండగట్టనున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రజాగళం సభను విజవంతం చేద్దామని పిలుపునిచ్చారు తన కుమార్తె నెలవల విజయశ్రీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు అంతా సన్నద్ధం కావాలని అన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మరళీకృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నాయకులు శ్రీరాంప్రసాద్, విజయ్‌కుమార్ నాయుడు, రఫీ, నెలవల రాజేష్, గాలి రమేషనాయుడు, హరిబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం





గూడూరులో ఎన్టీఆర్ విగ్రహానికి, నాయుడుపేటలో చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, మార్చి 29: పేదల అభ్యున్నతే ధ్యేయంగా టీడీపీ ఆవిర్భవించిందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ అగ్రకులాలకే పరిమితమైన రాజకీయ అధికారాన్ని బీసీ, ముస్లిం, ఎస్సీ, ఎస్టీలకు చేరువ చేసిందన్నారు. అభివృద్ధితో పాటు ఎన్నో సంక్షేమ పథకాలతో బడుగులకు అండగా నిలిచిందన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కుతో పాటు విద్య, ఉపాధి, రాజకీయాలో సముచిత స్థానం కల్పించిందని కొనియాడారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, నరసింహులు నాయుడు, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, తాళ్ల సుబ్బమ్మ, వాటంబేడు శివకుమార్, ఇశ్రాయిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్, అంబేడ్కర్, జ్యోతిరావు పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, కందల కృష్ణారెడ్డి, బొమ్మన శ్రీధర్, రఫీ, కిష్టయ్య, అశోక్ రెడ్డి, వేమసాని శోభన్‌నాయుడు, గూడూరు సుధీర్‌రెడ్డి, మధునాయుడు, రాజేంద్ర, న్యాయవాదులు పసల గంగాప్రసాద్, పసల చెంగయ్య, అవధానం సుధీర్, బొమ్మన పళణి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: టీడీపీ మండల కన్వీనర్ గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ జెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, ఓజిలి యూనిట్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, ముస్లిం నాయకుడు ఎస్‌కే ఖలీల్, సీనియర్ నాయకులు ఎద్దల ధనుంజయరెడ్డి, రవీంద్రారెడ్డి, కార్తీక్‌రాజు, వెంకటేశ్వర్లు నాయుడు, కోటిరాజు, అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

కోట: కోట క్రాస్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. జెండా ఎగురవేశారు. ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జలీల్ అహ్మద్, తీగల సురేష్‌బాబు, బాలకృష్ణయాదవ్, కోటేశ్వరప్రసాద్, మధుయాదవ్, షంషద్దీన్, నాయబ్, శ్రీనివాసులు, వంశీ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తడ: స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, బొమ్మన పళణి, సెల్వం, నీలకంఠం, రవి, శ్యామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండా ఎగురవేసి స్వీట్లు పంచారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, బీసీ సెల్ నాయకులు చిట్టేటి పెరుమాల్, వాకచర్ల రమేష్, మెస్ రమణయ్య, బుద్ధి విజయలక్ష్మి, ఆలీ బాయ్, మేడా సాయినారాయణ, బుద్ధి విజయలక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు ఉజ్వల భవిత



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పాశం జశ్వంత్‌కుమార్

గూడూరు అర్బన్, మార్చి 29: టీడీపీతోనే యువతకు ఉజ్వల భవిత సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కుమారుడు డాక్టర్ జశ్వంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టుసెంటర్ ప్రాంతంలో శంఖారావం, సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని, ఏటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని నమ్మించి మోసం చేసిందన్నారు. చంద్రబాబునాయుడు ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఎన్నో పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పించారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, ఛాన్‌బాషా, అబ్దుల్‌రహీం, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

సూళ్లూరుపేట, మార్చి 29: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి పరసా వెంకటరత్నం అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నాయుడుపేటలో చంద్రబాబు నిర్వహించే ప్రజాగళం సభలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. అందరూ కలిసి పనిచేసి టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీని గెలుపించుకోవాలన్నారు. తాను అలకబూనాని చెప్పడం అవాస్తవమని, చంద్రబాబు మాటే తనుకు శిరోధార్యమని, చివరి రక్తపుబొట్టు వరకు టీడీపీలోనే ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొక్కు శంకరయ్య, బీసీ సెల్ నాయకులలు సుబ్రహ్మణ్యం, ఎల్లయ్య, గురుకుల సుబ్రమణ్యం, పాకం వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒకదాన్నొకటి ఢీకొన్న నాలుగు వాహనాలు

ప్రయాణికులు సురక్షితం

చిల్లకూరు, మార్చి 29: మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. నెల్లూరు నుంచి చెన్నై వెళ్లే మార్గంలో గేదె అడ్డం రావడంతో ఓ కారు అకస్మాత్తుగా ఆగడంతో వెనుక వస్తున్న మూడు కార్లు, ఆర్టీసీ బస్సు ఒకదాన్ని ఒకటి వెనుక నుంచి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు, బస్సులో ప్రయాణిస్తున్న ఎవరికీ ఏలాంటి గాయాలు కాలేదు. రెండు కార్లు, ఆర్టీసీ బస్సు దెబ్బతిన్నాయి.

సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్ వితరణ



తడ, మార్చి 29: శ్రీసిటీలోని క్యాడ్‌బరీ డెయిరీ మిల్క్, ఓరియో, బోర్న్‌విటా వంటి దిగ్గజ బ్రాండ్‌ల తయారీ పరిశ్రమ మోండెలెజ్ ఇండియా, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా శుక్రవారం సూళ్లూరుపేట కమ్యూనిటీ ప్రభుత్వాస్పత్రికి రూ.30 లక్షల విలువైన అధునాతన వసతులు కలిగిన అంబులెన్స్‌ను వితరణగా ఇచ్చింది. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి(డీఎంఅండ్‌హెచ్‌వో) కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డా.శ్రీహరికి మెండెలెజ్ ప్లాంటు డైరెక్టర్ అమిత్‌జైన్ అధికారికంగా అంబులెన్స్ తాళాలను అందజేశారు.

పెంతాలిన్ పోటీలకు గూడూరు బాలికలు



ఆర్తి, పద్మావతి

గూడూరు, మార్చి 29: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో శనివారం నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ మోడరన్ పెంతాలిన్ పోటీల్లో గూడూరు జడ్పీబాలిక ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొంటారని పీడీ విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. మూడురోజుల క్రితం నెల్లూరులో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ మోడరన్ పెంతాలిన్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. శనివారం నుంచి తిరుపతిలో జరగనున్న స్విమ్మింగ్, పరుగు పదెం పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థినులకు హెచ్‌ఎం మాధవీలక్ష్మి అభినందనలు తెలిపారు.

కాశీవిశ్వేశ్వరాలయ అభివృద్ధికి సహకారం

తడ, మార్చి 29: చిన్నమాంబట్టులో వెలసిన కాశీవిశ్వేశ్వర, అన్నపూర్ణాదేవి ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఈవో నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన ఆలయాన్ని పరిశీలించారు. అన్నపూర్ణాదేవి అన్నదాన సమాజం ట్రస్టు వ్యవస్థాపకుడు, తిరుపతి స్విమ్స్ వైద్యుడు మునస్వామి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తగిన సహకారం అందించాలని, అలాగే శ్రీకాళహస్తి నుంచి ఇక్కడికి ప్రత్యేక బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఈవో నాగేశ్వరరావు తగిన సహకారం అందిస్తామని చెప్పారు.

కోడి పందేల స్థావరంపై దాడులు: ముగ్గురి అరెస్టు

కోట, మార్చి 29: మండలంలోని రుద్రవరం శివార్లలో కోడి పందేల స్థావరంపై శుక్రవారం రాత్రి ఎస్ఐ నాగబాబు జరిపిన ఆధ్వర్యంలో పోలీసులు దాడులు జరిపారు. కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక మోటారు బైక్, 15 కత్తులు, రూ.2,500 నగదు, మూడు కోడిపుంజులను స్వాధీనం చేసుకొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తాగునీటి ఎద్దడిని నివారించండి

వెంకటగిరిటౌన్, మార్చి 29: గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించాలని ఎంపీడీవో నీలకంటేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి పంపులను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలన్నారు. నీటి సరఫరా పథకాల నిర్వహణ, వాటి పర్యవేక్షణ ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివరావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ శ్రీనివాసులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అళఘునాథస్వామికి లక్షతులసీ పూజ

గూడూరు అర్బన్, మార్చి 29: స్థానిక అళఘునాథస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భూదేవి, శ్రీదేవి సమేత అళఘునాథస్వామిని ప్రత్యేకంగా ఆలంకరించి లక్షతులసీ పూజ జరిపారు. రాత్రి స్వామివారికి ఏకాంతసేవను జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఓటు వజ్రాయుధం

కోట, మార్చి 29: ఓటు వజ్రాయుదంతో సమానమని అధికారులు అన్నారు. కోట పట్టణంలో శుక్రవారం ఓటు ప్రాముఖ్యతను తెలుపుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్రాస్‌రోడ్డులో మానవహారం ఏర్పాటు చేశారు. తహసీల్దారు నాగరాజరావు, ఎంపీడీవో శంకరయ్య, ఎస్ఐ నాగబాబు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్

పూరిల్లు దగ్ధం

చిట్టమూరు, మార్చి 29: చిట్టమూరు మండలం కోగిలి గ్రామంలో ప్రమాదవ శాత్తు గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి మునీంద్ర ఇంటిలోని సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ కావడంతో మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఇంట్లోని సామగ్రి, రూ.15 వేల నగదు, కొంత బంగారు ఆభరణాలు కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు.

ఎన్నికల కోడ్ ఎఫెక్ట్..!

ఎస్వీయూలో అకడమిక్ సెనేట్ సమావేశం రద్దు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 29: ఎస్వీ యూనివర్సిటీలో నిర్వహించాల్సిన అకడమిక్ సెనేట్ సమావేశం ఎన్నికల కోడ్ కారణంగా రద్దు అయ్యింది. ఏటా మార్చి నెలాఖరులోపు అకడమిక్ సెనేట్ సమావేశం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. యూనివర్సిటీ పరిధిలోని పలు కాలేజీలు, విభాగాల పరిధిలో నిర్వహించే వివిధ కోర్సులు, కొత్త కోర్సుల ఏర్పాటు, సిలబస్ మార్పు, పరీక్షల నిర్వహణ, ఇతర అకడమిక్ వ్యవహారాలపై చర్చించేవారు. ఈనెల 30వ తేదీ సమావేశం నిర్వహించనున్నట్టు అకడమిక్ సెనేట్ సభ్యులు, సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఈ సమావేశం రద్దు చేయాలని తాజాగా నిర్ణయించినట్టు తెలుస్తోంది. కోడ్ ముగిశాక నిర్వహించే అవకాశముంది.

విశ్వం పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ అవగాహనా సదస్సుకు విశేష స్పందన

తిరుపతి(విద్య), మార్చి 29: స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పాలిటెక్నిక్, ఎ.పి.ఆర్.జె.సి నమూనా ప్రవేశ పరీక్షకు, అవగాహనా సదస్సుకు విశేష స్పందన లభించిందని ఆ విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు హాజరై నమూనా పరీక్షలు రాశారని చెప్పారు. 2023 పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థిని చరితశ్రీ 120కి గాను 119 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించిందని వెల్లడించారు. అలాగే ఏపీఆర్జేసీ ఫలితాల్లో తనూజ, భువనేశ్వర్ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాకులను సాధించారని వివరించారు. పాలిటెక్నిక్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్, మైనింగ్, కెమికల్, బయోమెడికల్ తదితర కోర్సులు ఉంటాయని, మెరుగైన ర్యాంకు సాధించడం ద్వారా మంచి కళాశాలలో సీట్లతోపాటు ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని వివరించారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27 ఉంటుందని, ఏప్రిల్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25వ తేదీన ఉంటుందని, మార్చి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8688888802, 9399976999లలో సంప్రదించాలని కోరారు.

సంక్షేమానికి పుట్టిల్లు టీడీపీ: ఆదిమూలం



టీడీపీలోకి చేరిన వారితో ఆదిమూలం

నారాయణవనం, మార్చి 29: ప్రజా సంక్షేమానికి, అన్నివర్గాల అభ్యున్నతికి పుట్టిల్లు టీడీపీ అని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం పేర్కొన్నారు. నారాయణవనంలో శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో అన్నివర్గాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. కల్యాణపురం పంచాయతీకి చెందిన పలువురు మాజీ సర్పంచు లోకయ్య, శంకరయ్య, మాజీ ఎంపీటీసీ గోపాల్, జనసేన నాయకులు బాలు ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి ఆదిమూలం పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు భాస్కరన్, రంగయ్య, మహేష్, సాయి, శేఖర్, గోపీ, జగదీష్, గోవిందయ్య, అములు, చెంచులక్ష్మి, మధుబాబు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వేడుకగా పద్మావతీదేవి ఊంజలసేవ

నారాయణవనం, మార్చి 29: స్థానిక కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజలసేవ శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి, పద్మావతి అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణతో ఊంజలసేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

నారాయణవనం, మార్చి 29: నారాయణవనానికి చెందిన టీడీపీ సీనియర్ నేత జయరామయ్య శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మతదేహానికి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు భాస్కరన్ తదితరులు ఉన్నారు.

టీడీపీ జెండా... పేదలకు అండ





టీడీపీ పట్టణ కార్యాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరణ - కేక్ కట్ చేస్తున్న విజయబాబు

పుత్తూరు అర్బన్, మార్చి 29: టీడీపీ జెండా పేదలకు అండని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు అన్నారు. శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్యాణపురం వద్ద ఉన్న ఆ పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీకగా ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన విషయాన్ని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం టీడీపీతోనే మొదలైందని కొనియాడారు. చంద్రబాబునాయుడు పార్టీ పగ్గాలు చేపట్టాక సంక్షేమంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టించారని తెలిపారు. రైతుల బిడ్డలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా దేశ విదేశాల్లో రాణిస్తున్నారంటే టీడీపీ ప్రభుత్వం, చంద్రబాబునాయుడు చేసిన అవిరామకృషే కారణమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయదుధింటి మోగించడం ఖాయమని ఆయన తేల్చి చెప్పారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.అలాగే టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో టీడీపీ భారీ మెజార్టీతో విజయం సాధించనుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రానుందని, చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి ఖావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనపాల్, బాలాజీనాయుడు, చంద్రాయాదవ్, బాబూరాయల్, మధుసూదన్‌రాజు, మణికంఠన్, కోదండపాణి, రాజా, పరంధాము, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

దళితుల ఆత్మగౌరవం టీడీపీతోనే


ప్రచారం నిర్వహిస్తున్న ఎస్సీసెల్ నాయకులు

తొట్టంబేడు, మార్చి 29: దళితులు ఆత్మ గౌరవంతో బతకాలంటే టీడీపీని గెలిపించుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపీనాథ్ అన్నారు. మండలంలోని కారాకొల్లు, దొంగల ముదూరు గ్రామాలలోని ఎస్సీ కాలనీలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నిల్లో బొజ్జల సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ ఎస్సీసెల్ నాయకులు వెంకటసుబ్బయ్య, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు సునీల్, మాజీ సర్పంచ్ చలపతి, నాయకులు రాజ, సుబ్రమణ్యం, చెంచయ్య, రమేష్, ప్రభాకర్, వెంకటరమణయ్య, ధర్మయ్య పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


చిన్నారిని అభినందిస్తున్న మాస్టర్ మణికుమార్

శ్రీకాళహస్తి, మార్చి 29: శ్రీకాళహస్తికి చెందిన గురుసాత్విక అనే విద్యార్థిని అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటింది. శ్రీకాళహస్తిలోని లిటిల్ మాస్టర్ అబాకస్ ఇన్‌స్టిట్యూట్లో చిన్నారి అబాకస్‌లో శిక్షణ పొందింది. ఇటీవల చెన్నైకు చెందిన అమత ఆర్గనైజేషన్ సంస్థ ఆన్‌లైన్‌లో అబాకస్ పోటీలు నిర్వహించింది. గురుసాత్విక ప్రథమ స్థానంలో నిలిచి ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్ అవార్డును అందుకుంది. శుక్రవారం మాస్టర్ మణికుమార్ చిన్నారిని అభినందించారు.

టీడీపీలో చేరిన వలంటీరు దంపతులు

ఏర్పేడు, మార్చి 29: ఏర్పేడు మండలం పంగూరు పంచాయతీ కాట్రకాయల గుంట గ్రామానికి చెందిన వలంటీరు ఈశ్వరమ్మ, ఆమె భర్త సుధాకర్ బొజ్జల సుధీర్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ బీసీ నేత బుజ్జిరెడ్డి కూడా టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాఘవేంద్రరావు, సురేష్ నాయుడు, నాగరాజునాయుడు, భాస్కర్‌నాయుడు, సుబ్రహ్మణ్యం, రామయ్య, వెంకట్రామయ్య, కుమార్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఏర్పేడు, మార్చి 29: ఏర్పేడు మండలం అంజిమేడు గ్రామానికి చెందిన 15 సంవత్సరాల యువతి అదృశ్యమైనట్లు ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదుచేశారు. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీలను ఉన్నత స్థానంలో చూడాలన్నదే బాబు తపన


మాట్లాడుతున్న రెడ్డివారి గురవారెడ్డి

ఏర్పేడు, మార్చి 29: బీసీల కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకు వచ్చి వారిని ఉన్నత స్థానంలో చూడాలన్నదే చంద్రబాబు తపన అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. ఏర్పేడు మండలంలోని 9వ క్లస్టర్‌లో జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా బీసీ సోదరుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ఎన్టీఆర్ బీసీల కోసం స్థానిక సంస్థల్లో 24 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. చంద్రబాబు దానిని 34శాతానికి చేర్చారన్నారు. సీఎం జగన్ దానిని 30 శాతానికి తగ్గించి 16,800మందిని పదవులకు దూరం చేశారన్నారు. బీసీలు ఉన్నతంగా జీవించాలంటే చంద్రబాబును మరోసారి ముఖ్య మంత్రిని చేయాలన్నారు. బాలగురవయ్యయాదవ్, కృష్ణయ్య, సుబ్రహ్మణ్యంరెడ్డి, సుబ్రహ్మణ్యంయాదవ్, కుమార్, బత్తెయ్యయాదవ్, నిరంజన్, మునీంద్ర, సుబ్బరామిరెడ్డి, వెంకటయ్య, శ్రీనివాసులు, మోహన్, బీసీలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు



శ్రీకాళహస్తి, మార్చి 29: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలం పై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సామూహిక లలితా సహస్ర నామం పఠించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 29: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా శుక్రవారం ఉత్సవం



శ్రీకాళహస్తి, మార్చి 29: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగంచుకోండి

రేణిగుంట, మార్చి 29: రానున్న ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగంచుకోవాలని సీఐ మల్లికార్జున్ కోరారు. శుక్రవారం కరకంబాడి పంచాయతీలోని తారకరామానగర్‌లో ఎన్నికలపై స్థానిక ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి, మార్చి 29: ముక్కంటి ఆలయాన్ని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. గుజరాత్ హైకోర్టు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ ఆలయానికి విచ్చేశారు. అలాగే హిమాలయ ప్రాంతం నుంచి వాసునంద సరస్వతి జీ మహారాజ్ స్వామి శిష్య బృందంతో ముక్కంటి క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఆలయ ఈవో నాగేశ్వరరావు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మహిళల అభ్యున్నతి టీడీపీకే సాధ్యం

ఏర్పేడు, మార్చి 29: మహిళల అభ్యున్నతి టీడీపీకే సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి తెలియజేశారు. మడిబాక పంచాయతీ రాజులకండ్రిగ గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు తెలుగుదేశం ప్రభుత్వంలో గౌరవంగా ఉండేవారన్నారు. రాబోయే టీడీపీ ప్రభుత్వంలో ప్రతి మహిళకూ నెలకు రూ.1,500, ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ సిలిండర్లు, చదువుకునే ప్రతిబిడ్డకు రూ.15వేలు సంవత్సరానికి ఇస్తామని తెలిపారు. ప్రజలంతా సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్య క్రమంలో నాగరాజునాయుడు, కృష్ణవేణి, ధనంజయులనాయుడు, మోహన్ నాయుడు, పాపిరెడ్డి, తిరుపాలయ్య, మల్లికార్జుననాయుడ, బాబునాయుడు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

వరదయ్యపాళెం, మార్చి 29: వరదయ్యపాళెంలో టీడీపీ అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసరాజు, నిర్మల్ కుమార్, కిరణ్‌కుమార్, శివయ్య, భాస్కర్‌నాయుడు, రమేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మునెయ్య, వెంకయ్య, శంకర్ పాల్గొన్నారు.

రేణిగుంట: రేణిగుంటలోని పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. టీడీపీ మండలాధ్యక్షులు మునిచంద్రారెడ్డి, మహబూబ్‌బాషా, పుష్ప నాదన్, మునస్వామినాయుడు, చిన్నారెడ్డి, రవి, భాస్కర్, మురళి పాల్గొన్నారు.

క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు



రేణిగుంట, మార్చి 29: రేణిగుంటలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు చర్చిల్లో శుక్రవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర శుక్రవార ప్రాముఖ్యతను చర్చి ఫాదర్లు వివరించారు. ఏసు శిలువ మార్గంలో పలికిన ఏడు మాటలు ఉపదేశించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నీర్పాకోట ఈసీఐ చర్చిలో పాస్టర్ జయపాల్ ప్రార్థనలు చేశారు. కాంపాళెం, లక్ష్మీపురం, కారణిమిట్ట, కుమార వెంకటా పురం, వీఎస్‌పురం తదితర గ్రామాలలో ప్రార్థనలు జరిగాయి.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

కేవీబీపురం, మార్చి29: రాబోయే ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సింధు ప్రియ హెచ్చ రించారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎస్ఐ నజీరుద్దీన్, ఏఎస్ఐ లోకనాథం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా 'ప్రజాగళం' ఏర్పాట్లు


బేరివారి మండపం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 29: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం సభ కోసం శ్రీకాళహస్తిలో ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. పట్టణ శివారు ఎంజీఎం ఆస్పత్రి ఆవరణంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి చంద్రబాబు శనివారం సాయంత్రం పట్టణంలోని బేరివారి మండపం కూడలికి రోడ్డు మార్గంలో వెళ్లనున్నారు. మండపం వద్ద ప్రజాగళం బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. అనంతరం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రాత్రి బస చేయనున్నారు. ఆదివారం ఉదయం అల్పాహారం అనంతరం తిరిగి ఎంజీఎం ఆస్పత్రి వద్ద నుంచి హెలికాప్టర్‌లో వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సుధీర్ రెడ్డి టీడీపీ నాయ కులతో కలిసి హెలిప్యాడ్ ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బేరివారి మండపం వద్ద బహిరంగ సభ జరిగే ప్రాంతంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బం దులు కలుగకుండా అవ సరమైన ఏర్పాట్లను చేపట్టారు. నాయకులతో కలసి కాన్వాయ్ ప్రవేశం, అలాగే సభలో చంద్రబాబు ప్రసంగించే వాహనం నిలిపే చోటు, కాన్వాయ్ అక్కడి నుంచి తిరిగి వెళ్లే మార్గంపై రాత్రి వేళ సుమారు రెండు గంటల పాటు కసరత్తు చేశారు. అలాగే చంద్రబాబు బసచేసే పార్టీ కార్యాల యంలో అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. టీడీపీ నాయకులు మునిరాజ నాయుడు, విజయ్ కుమార్, కాసరం రమేష్ పాల్గొన్నారు.

ప్రజాగళం చరిత్రలో నిలిచిపోవాలి


మాట్లాడుతున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 29: ప్రజాగళం సభ విజయవంతమై శ్రీకాళహస్తి చరిత్రలో నిలిచి పోవాలని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజాగళం సభపై పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బేరివారి మండపం వద్ద శనివారం సాయంత్రం టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం బహిరంగ సభకు విచ్చేయనున్నట్లు తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులతో పాటు నియోజక వర్గంలోని అన్నివర్గాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శిలు గాలి చలపతి నాయుడు, గురవారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు ప్రసాద్, పట్టణ అధ్యక్షులు విజయ్‌కుమార్, పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు నివాసం వద్ద టీడీపీ, బీజేపీ నాయకులు సమావేశమై ప్రజాగళంసభ ఏర్పాట్లపై చర్చించారు. బొజ్జల సుధీర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, కోలా ఆనంద్, నియోజకవర్గ పరిశీలకులు ప్రసాద్ పాల్గొన్నారు.

భూమి ఒకరిది..పరిహారం వేరొకరికి..!

న్యాయం చేయాలంటున్న బాధితుడు


మీడియాతో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

ఏర్పేడు, మార్చి 29: అసలే భూసేకరణలో పొలం పోగొట్టుకున్నాడు.. సరేలా ఎంతో కొంత పరిహారం వస్తుందిలే అని మనసుకు సర్దిచెప్పుకున్నాడు.. తీరా అధికారుల నిర్లక్ష్యంతో ఆ నష్టపరిహారం అతడి పక్క పొలం వ్యక్తికి దక్కింది. అసలైన బాధితుడు న్యాయం కోసం ఏడాదిగా అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా కనికరించడంల లేదు. బాధితుడు నల్లపాళెం కృష్ణారెడ్డి శుక్రవారం ఏర్పేడులోని పంచాయతీ కార్యాలయం వద్ద విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఏర్పేడులోని పల్లివీధికి చెందిన నల్లపాళెం కృష్ణారెడ్డికి తన తండ్రి శంకురెడ్డి నుంచి మేర్లపాక రెవెన్యూ 7/1 సర్వే నెంబరులో 8 సెంట్లస్థలం వారసత్వంగా వచ్చింది. ఆ స్థలాన్ని కృష్ణారెడ్డి సాగు చేసుకుంటున్నాడు. ఆ మార్గంలో ఏర్పేడు నుంచి వెంకటగిరి వరకు నాలుగులేన్ల రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం భూమి సేకరించింది. రోడ్డు నిర్మాణంలో స్థలం కోల్పోయిన రైతులందరికీ ప్రభుత్వం పరిహారం అందించింది. కృష్ణారెడ్డికి మాత్రం అందించలేదు. రెవెన్యూ కార్యాల యానికి పలుమార్లు తిరిగితే పరిహారం వేరే వ్యక్తికి చెల్లించినట్లు వెల్లడైంది. దీంతో ఆయన అప్పటి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి తిరుగుతూనే ఉన్నాడు. కలెక్టర్‌కు సైతం స్పందనలో ఫిర్యాదు చేశాడు. అయినా ఫలితం లేకపోయింది. తనకు నలుగురు పిల్లలు ఉన్నారని పరిహారం ఇప్పిస్తే కుటుంబపోషణకు ఆసరగా ఉంటుందని వాపోతున్నాడు.

మృతుని కుటుంబానికి భరోసా

శ్రీకాళహస్తి, మార్చి 29: శ్రీకాళహస్తి పట్టణం ఎం.పుత్తూరుకి చెందిన రైతు మునిరెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతదేహానికి బొజ్జల రిషితారెడ్డి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

శ్రీకాళహస్తి, మార్చి 29: శ్రీకాళహస్తీశ్వరాలయం నాలుగో గేటు సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. మృతుడు కొంతకాలంగా ఆలయ పరిసరాల్లో యాచకుడిగా జీవనం సాగించేవాడు. ఎండ తీవ్రతతో రోడ్డుపై కుప్పకూలి మృతి చెందాడు. శ్రీకాళహస్తి 1 టౌన్ పోలీసులు అతడి మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కోలా ఆనంద్‌ను కలిసిన సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 29: టీడీపీ, బీజేపీ నేతలు ఆత్మీయంగా భేటీ అయ్యారు. కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డిని శేషవస్త్రంతో సత్కరించి స్వాగతం పలికారు. శనివారం ప్రజాగళం సభకు కోలా ఆనంద్‌ను ఆహ్వానించారు. టీడీపీ నాయకులు విజయ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గణపతి హోమం

శ్రీకాళహస్తి, మార్చి 29: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాస్త్రోక్తంగా గణపతి హోమం నిర్వహించారు. సంకట హర చతుర్థి పురస్కరించుకొని శుక్రవారం ఆలయంలోని అంజి అంజి గణపతి వద్ద విశేష పూజలు చేశారు. ముందుగా అర్చకులు స్వామి కొలువైన సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం కలశ స్థాపనతో సంకల్పం పూజలు చేశారు. వినాయక స్వామికి విశేషంగా అభిషేకాలు చేశారు. వేదోక్తంగా వివిధ పూజా ద్రవ్యాలతో హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలతో హారతులు సమర్పించారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్టు

తొట్టంబేడు, మార్చి 29: మండలంలోని శివనాథపురం వద్ద తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. శ్రీకాళహస్తి కొండ మిట్టకి చెందిన కిరణ్ నుంచి ఆరు మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండుకు తరలించారు.

టీడీపీతోనే మైనారిటీల అభివృద్ధి : ఎమ్మెల్యే ఆదిమూలం


టీపీకోటలో మైనారిటీ నాయకులతో ఆదిమూలం

నాగలాపురం, మార్చి 29: టీడీపీతోనే మైనారిటీల అభివృద్ధి సాధ్యమని సత్యవేడు ఆ పార్టీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం మండ లంలోని టీపీకోట, బీరకుప్పం, రాజుల కండ్రిగ, వెళ్లూరు, ఎస్ఎస్‌పురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా టీపీకోటలోని మైనారిటీ నాయకుడు సమీ ముల్లా ఇంటికి విచ్చేసిన ఆయన అక్కడి మైనారిటీ నాయకులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తమను గెలిపించాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే నియో జకవర్గంలో షాదీ మహల్ ఏర్పాట్లు, శ్మశానాల అభివృద్ధికి ప్రత్యేక కృషిచేస్తామని తెలిపారు. అంతకు మునుపు రాజుల కండ్రిగలోని టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు ప్రసాద్‌రాజు, విశ్రాంత సీఐ, బీజేపీ నాయకుడు జయచంద్రరాజు, బీరకుప్పం టీడీపీ సీనియర్ నాయకుడు సుబ్రహ్మణ్యంరాజు, టీపీ కోట మనోహర్ నాయు డులను వారి ఇళ్ల వద్దకు వెళ్లి కలిశారు. రాజులకండ్రిగ గ్రామంలో టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు నజీర్‌బాషా, చాన్‌బాషా, బాబుసాహెబ్, లియాఖత్ అలీ, గఫార్, నారాయణవనం నాయకులు భాస్కర్, గోవిందస్వామి, మందారవి, కొండూరు బాలరాజు, లోకయ్య, నాగలాపురం నాయకులు పార్తీబన్, పురుషోత్తంనాయుడు, నరేంద్రరెడ్డి, జాన్సన్, నెల్సన్ మండేలా, మాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆదిమూలానికి వ్యతిరేకం కాదు..అయినా ఆయన వద్దు

● అభ్యర్థిని మార్చండంటూ తిరుపతిలో సత్యవేడు టీడీపీ నేతల సమావేశం


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తిరుపతి (జీవకోన), మార్చి 29: కోనేటి ఆదిమూలానికి తాము వ్యతిరేకం కాదంటూనే సత్యవేడు నియోజవకర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొత్త వ్యక్తికి అవకాశం ఇవ్వాలని పార్టీ అధినేత చంద్రబాబుకు సత్యవేడు నియోజకవర్గంలోని కొందరు టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుపతిలో సమావేశమైన టీడీపీ నాయకులు అనంతరం మీడియాతో మాట్లాడారు. సత్యవేడు టీడీపీకి కంచుకోటగా ఉందని 8 పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో రెండుసార్లు మాత్రమే ఓటమి పాలు చెందిందని గుర్తుచేశారు. ప్రజలంతా సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును సీఎం చేయాలని ఎదరు చూస్తున్నారని అలాంటి తరుణంలో ఆదిమూలానికి టిక్కెట్టు కేటాయించడం సరైన నిర్ణయం కాదని దీనిపై పునరాలోచించాలని కోరారు. తామంతా పార్టీ నిర్ణయా నికే కట్టుబడి ఉంటామని అన్నారు. ఈ సమావేశానికి నియోజక వర్గంలోని మూడు మండలాల టీడీపీ అధ్యక్షులు హాజరయ్యారు. నాలుగు మండలాల నేతలు రాలేదు. నియోజకవర్గ మహిళా అధ్యక్షులు వరలక్ష్మి, నారాయణపురం మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు గోపి, బీఎన్‌కండ్రిగ, నారాయణవనం మహిళా నాయకులు ఉషారాణి, లత పాల్గొన్నారు.

తెలుగుజాతి రాజసం టీడీపీ

శ్రీకాళహస్తి, మర్చి 29: టీడీపీ తెలుగుజాతి రాజసాన్ని ప్రపంచానికి చాటిందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తిలో టీడీపీ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఎగరవేశారు. కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ కూడలి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు ప్రసాద్, నాయకులు విజయ్ కుమార్, కంఠా రమేష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మోదుగులపాళెంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏర్పేడులో మండల పార్టీ అధ్యక్షుడు పొన్నారావు ఆధ్వర్యంలో, పాపానాయుడు పేటలో తంబా కృష్ణప్ప మొదలియార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం మొదలియార్, మణి మొదలియార్, మస్తాన్‌నాయుడు, దయాకర్, మంచు భరత్, కిరణ్, చంద్రశేఖర్, వెంకటేష్, కరుణాకర్, విజయ్‌బాబు, గ్రామపెద్దలు, యువత పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు. జిల్లా గ్రాంథాలయ మాజీ ఛైర్మన్ కన్నయ్య నాయుడు, నాయకులు రమేష్‌బాబు, మునె య్య నాయుడు శ్రీనివాసులు, ఉషా రాణి, ముని సుబ్బయ్య, భాస్కర్‌యాదవ్, మునిరాజా, భూపయ్య మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

కేవీబీపురం: టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులనాయుడు, తిరుపతి పార్లమెంటరీ రైతు విభాగం అధ్యక్షుడు గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా గుడి వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సత్యవేడు: సత్యవేడులో టీడీపీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఇంటి వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బీబీఎస్.రెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, శంకరయ్య, షణ్ముగం, దాహంద్, చంద్ర మోహన్, మధు, దిలీప్, శశి, రవి, మిల్క్‌మనీ, బాలాజీరెడ్డి, పంచాల సుబ్రహ్మణ్యం, ప్రసాద్‌రెడ్డి, సురేష్, దినేష్, గుణ, కుమార్, కార్తీక్, ఆటో కుమార్, బక్కయ్య, సూర్య, వెంకటేశ్వరులు, పవన్ పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, పద్దురాజు, రామచంద్రరాజు, జయచంద్రనాయుడు, భాస్కరన్, ఆరుల్ ప్రకాష్, రవి, వాసు, ఢిల్లీబాబు, మణిగండ, మునస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.





ఏర్పేడు మండలం మోదుగులపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ, కేవీబీపురం, సత్యవేడుల్లో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు